మన క్రాంతి
KR TV
ఇది వాస్తవ పత్రిక...




Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 సంచిక :66 | మంగళవారం , 04 ఫిబ్రవరి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-

## తెలంగాణపై కేంద్రానిది సవతి తల్లి ప్రేమ.. చూస్తూ ఊరుకోం: మంత్రి తుమ్మల




## తెలంగాణ బీజేపీ జిల్లా అధ్యక్షుల ప్రకటన.. 25 జిల్లాల అధ్యక్షులను ప్రకటించిన బీజేపీ

తెలంగాణ బీజేపీలో సంస్థాగత ఎన్నికల కోలాహలం షురువైంది. పార్టీ బూత్, గ్రామ, మండల కమిటీల ఎన్నికలు పూర్తి చేసుకున్న రాష్ట్ర బీజేపీ నాయకత్వం జిల్లా కమిటీల అధ్యక్షుల ఎంపికపై ఫోకస్ పెట్టింది. ఈ మేరకు 25 జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించింది. ఏకాభిప్రాయం కుదరని మరో 13 జిల్లాల అధ్యక్షుల నియామకాన్ని పెండింగ్‌లో పెట్టింది. పార్టీ పరంగా వ్యవహారాల కోసం మొత్తం 38 జిల్లాలుగా తెలంగాణను విభజించి అధ్యక్షుడ్ని ప్రకటించడం బీజేపీలో ఉంది.




## కుల గణన సర్వేలో పాల్గొనకపోతే మళ్లీ డిటైయిల్స్ ఇవ్వొచ్చు: మంత్రి పొన్నం




తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేపై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. గాంధీభవన్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో కుల గణన ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్రంలో 96 శాతం ఆర్థిక, సామాజిక సర్వే చేశామని చెప్పారు.

# బీసీ జనాభాపై కాంగ్రెస్ పెద్ద కుట్ర?



రాష్ట్రంలో బీసీ జనాభా 46.25 శాతంగా కాంగ్రెస్ ప్రభుత్వం లెక్క తేల్చింది. దీనిపై బీసీ సంఘాలు మండిపడుతున్నాయి. దేశ చరిత్రలోనే కాదు.. తెలంగాణ చరిత్రలోనూ ఇంతకంటే పెద్ద కుట్ర లేదని ధ్వజమెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న లెక్కలన్నీ తప్పులతడక అంటున్నాయి. నిన్న ప్రభుత్వం కులగణన వివరాలు ప్రకటించిన తర్వాత చాలామంది బీసీ విద్యావేత్తలు, మేధాలువు సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కులగణన సమగ్రంగా పూర్తి కాలేదన్నారు. బీసీ జనగణనలో మా పేర్లు గాని, మా కుటుం సభ్యుల వివరాలు గాని నమోదు చేయలేదంటున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం చేసిన సర్వేలో శాస్త్రీయత లేదని స్పష్టమౌతున్నది. రాష్ట్రంలో మొత్తంగా 3.70 కోట్ల మంది జనాభా ఉండగా.. వారిలో 3,54,77,554 (96.9 శాతం) పూర్తిచేశామన్నారు. ప్రభుత్వం కూడా 1.03 లక్షల ఇండ్లు తలుపు వేసి ఉండటం, 1.68 లక్షల కుటుంబాలు సర్వేలో పాల్గొనడానికి సంకోచించడం, 84,137 ఇండ్లు నివాసేతరంగా ఉండటం వంటి సమస్యలతో 3,64,323 ( 3.1 శాతం) కుటుంబాల వివరాలు అంటే 16 లక్షల జనాభా వివరాలు సేకరించలేదని చెప్పింది. 3.1 శాతం వివరాల్లేకుండా సామాజిక వర్గాల వారీగా లెక్కలు చెప్పడం చెల్లుబాటు అవుతుందా అని ప్రశ్నిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో 40 శాతమైనా సర్వే పూర్తి కాలేదని సామాజిక, కుల సంఘాలు మండిపడుతున్నాయి.

3లో

## గ్రూప్-1 ఫలితాల విడుదలకు లైన్ క్లియర్




గ్రూప్-1 ఫలితాల విడుదలకు లైన్ క్లియర్ అయ్యింది. గ్రూప్-1పై దాఖలైన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. వివిధ రకాల అభ్యంతరాలతో అభ్యర్థులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నేడు(సోమవారం) విచారణ చేపట్టిన ధర్మాసనం వాటిని కొట్టివేసింది. దీంతో ఫలితాల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు అయ్యింది. గతంలో గ్రూప్-1 నియామకాలకు సంబంధించి పలువురు అభ్యర్థులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. అయితే వారి పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ అభ్యర్థులు దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కాగా, తెలంగాణ ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన సుప్రీంకోర్టు.. పిటిషన్లను కొట్టివేస్తూ తీర్పు వెల్లడించింది. కేసుల అడ్డంకులు తొలగిపోవడంతో టీజీపీఎస్సీ త్వరలో గ్రూప్-1 ఫలితాలు విడుదల చేయనుంది. కాగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 11 సంవత్సరాల తర్వాత మొట్టమొదటి గ్రూప్-1 నియామకాలు ఇవే కావడం విశేషం.

3లో

## కేసీఆర్ కు లీగల్ నోటీస్



బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నేత కేసీఆర్ కు లీగల్ నోటీస్ ఇష్యూ అయ్యింది. అసెంబ్లీకి గైర్హాజరు నేపథ్యంలో కేసీఆర్‌కు ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్ అసోసియేషన్ ఇన్ తెలంగాణ ఇవాళ ఈ నోటీసులు పంపింది. అసెంబ్లీకి హాజరుకాని కేసీఆర్‌పై అనర్హత వేటు వేయాలని, శాసన సభలో అపోజిషన్ లీడర్‌గా తన కర్తవ్యాన్ని నిర్వర్తించని మాజీ సీఎం కేసీఆర్‌కు సభలో సభ్యునిగా కొనసాగే అర్హత లేదని నోటీసులో పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై అసెంబ్లీలో కేసీఆర్ పోరాటం చేయాలని, లేదంటే అసెంబ్లీకి రాని కేసీఆర్‌ను వెంటనే అపోజిషన్ లీడర్‌గా తొలగించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌కు స్పీకర్ సమన్లు జారీ చేసి వివరణ కోరాలని పేర్కొంటూ అసోసియేషన్ తరపు న్యాయవాది పాదూరి శ్రీనివాస్ రెడ్డి మెయిల్, స్పీడ్ పోస్ట్ ద్వారా లీగల్ నోటీసులు పంపించారు.

2లో

## ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత కోరుతూ సుప్రీంకోర్టుకు కేటీఆర్




తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సుప్రీం కోర్టు ను ఆశ్రయించారు. కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. బీఆర్ఎస్ తరపున సీనియర్ న్యాయవాది ఆర్య రామసుందరం వాదనలు వినిపించారు. ఇదే వ్యవహారంపై గతంలో దాఖలైన పిటిషన్‌కు కేటీఆర్ వేసిన పిటిషన్‌ను ధర్మాసనం జతచేసింది. కేటీఆర్ వేసిన పిటిషన్‌ను.. దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు అనర్హత పిటిషన్‌తో కలిపి విచారిస్తామని సుప్రీం ధర్మాసనం స్పష్టంచేసింది. పాత పిటిషన్‌తో కలిపి కేటీఆర్ పిటిషన్‌పై విచారణ చేస్తామని చెబుతూ తదుపరి విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 10కి వాయిదా వేసింది.

## మేజిస్ట్రేట్ ముందు తిట్టుకొన్న మోహన్ బాబు, మనోజ్


మెజిస్ట్రేట్ ఎదుట మంచు మనోజ్, మంచు మోహన్ బాబు పరస్పరం దూషణలకు దిగారు. మంచు మోహన్ బాబు ఫిర్యాదుతో ఇద్దరిని జిల్లా కలెక్టర్ విచారణకు పిలిచారు. ఆ క్రమంలో సోమవారం అంటే.. ఫిబ్రవరి 03వ తేదీ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ముందు వీరిద్దరు హాజరయ్యారు. దీంతో వారిద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. జిల్లా కలెక్టర్ వారిద్దరిని రెండు గంటల పాటు విచారించారు. అయితే వచ్చే వారం మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని వారిద్దరిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

మరోవైపు తల్లిదండ్రులు, వృద్ధులు సంరక్షణ చట్టం కింద తనకు భద్రత కల్పించాలంటూ జిల్లా కలెక్టర్‌ను కోరారు. అలాగే తన ఆస్తులను సైతం కాపాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆస్తి అంతా తాను కష్ట పడి సంపాదించిందని జిల్లా కలెక్టర్‌కు మోహన్ బాబు వివరించారు. అలాంటి ఈ ఆస్తిలో ఎవరి హక్కు లేదని ఆయన పేర్కొన్నట్లు తెలుస్తోంది. అయితే తనకు సంబంధించిన ఆస్తిలో మంచు మనోజ్ ఉన్నారని.. అతడిని అందులోనుంచి ఖాళీ చేయించాలని కోరారు.




## నేటిమాట

ఇతరుల చెడు గుణముల గురించి చర్చిస్తూ, నీ సమయాన్ని వృధా చేసుకోకు. అది నీకే విధంగాను ఉపయోగపడదు.



- శ్రీరామకృష్ణపరమహంస

## జైలు నుంచి బెయిల్‌పై వచ్చి.. వృద్ధురాలిపై రేప్, హత్య




అత్యాచారం కేసుల్లో జైలుకు వెళ్లిన ఓ కామోన్మాది.. మూడు రోజుల క్రితం బెయిల్‌పై విడుదలై మరో ఘాతుకానికి పాల్పడ్డాడు. ఈసారి ఏకంగా 64 ఏళ్ల వృద్ధురాలిని కాటేశాడు. తన కామవాంఛ తీర్చుకున్నాక ఆమెను దారుణంగా హత్య చేశాడు. గుంటూరు జిల్లా పెదనందిపాడులో జరిగిన ఈ దారుణ ఘటన స్థానికంగా సంచలనం రేపింది.

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ప్రశంసించిన ఉపరాష్ట్రపతి..




బొగ్గు, గనుల రంగంలో తీసుకువచ్చిన ఆవిష్కరణలపై కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డిని ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్కర్ ప్రశంసించారు. బొగ్గు, గనుల రంగంలో మరింత పారదర్శకత తీసుకురావడంలో అలాగే సామర్థ్యాన్ని పెంచడంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి కృషిచేశారని ధన్కర్ అభినందించారు.

# కులగణనపై కాంగ్రెస్ కాకిలెక్కలు..

### బీసీ రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో బిల్లు పెట్టాలి: ఎమ్మెల్సీ కవిత

బీసీ కులగణనపై కాంగ్రెస్ ప్రభుత్వం కాకి లెక్కలు చెప్పిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ల పెంపు కోసం అసెంబ్లీలో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. శాసన సభలో లఘు చర్చతో లాభం లేదన్నారు. బీసీలంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు అంత చిన్న చూపని ప్రశ్నించారు. జిల్లా పర్యటనలో భాగంగా పెద్దపల్లికి చేరుకున్న ఎమ్మెల్సీ కవితకు పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మేమెంతుంటే.. మాకంత వాటా అంటూ రాహుల్ గాంధీ నినాదం ఇచ్చారని గుర్తుచేశారు. దానిప్రకారం 46.3 శాతం బీసీలు, 10 శాతం బీసీ ముస్లింలు.. మొత్తం కలిపి 56 శాతం జనాభా ఉందని చెప్పారు. రిజర్వేషన్లను అమలు చేయాలంటూ రాజ్యాంగం పట్టుకొని దేశమంతా తిరిగే రాహుల్ గాంధీ.. బీసీల విషయంలో ఎందుకు వెనక్కితగ్గుతున్నారని నిలదీశారు.



2లో

# తెలంగాణ బీజేపీ జిల్లా అధ్యక్షుల ప్రకటన..

## 25 జిల్లాల అధ్యక్షులను ప్రకటించిన బీజేపీ

మొదటి పేజీ తరువాయి

ఇక.. రాష్ట్రానికి కొత్త అధ్యకుడు వచ్చాక మిగతా జిల్లాల అధ్యక్షుల ఎంపిక ఉంటుంది. అన్నీ అనుకూలిస్తే వారంలోనే రాష్ట్ర బీజేపీకి కొత్త సారథి వచ్చే అవకాశం ఉంది. ఇన్‌ఛార్జ్ శోభ కరంద్లాజే ముఖ్య నేతల అభిప్రాయం తీసుకున్నాక ఒకరిపేరు ఫైనల్ అయ్యే ఛాన్స్ ఉందంటున్నారు. ఒకవేళ ఏకాభిప్రాయం రాకపోతే అధ్యక్షుడితో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్స్‌ను నియమించే అవకాశాలు ఉన్నాయి.

హైదరాబాద్ అధ్యక్షుడిగా లంక దీపక్ రెడ్డి, అదేవిధంగా జయశంకర్ భూపాల్‌పల్లి అధ్యక్షుడిగా నిశిధర్ రెడ్డి, కామారెడ్డి అధ్యక్షుడిగా నీలం చిన్న రాజులు, హనుమకొండ అధ్యక్షుడిగా కొలను సంతోష్ రెడ్డి, వరంగల్ అధ్యక్షుడిగా గంట రవికుమార్, నల్లగొండ అధ్యక్షుడిగా నాగం వర్షిత్ రెడ్డి, జగిత్యాల అధ్యక్షుడిగా రాచకొండ యాదగిరి బాబులను ఫైనల్ చేసినట్లుగా సమాచారం.

కాగా, జిల్లా అధ్యక్ష పదవులకు శనివారం పలువురు నామినేషన్లు వేయగా.. అందులో కొందరు ఆదివారం తమ నామినేషన్లను విత్‌డ్రా చేసుకున్నారు. అయితే, పార్టీ వారి పేర్లను ఇంకా ప్రకటించలేదు. పార్లమెంట్ సమావేశాలు ముగిసే లోగా రాష్ట్రానికి కొత్త చీఫ్‌ను నియమించాలని పార్టీ భావిస్తోంది. ఆ తరువాత మిగిలిన జిల్లాలు, మండలాలకు అధ్యక్షులను నియమించే అవకాశం ఉంది. పార్టీ అనుబంధ సంఘాల ప్రెసిడెంట్లు, కార్యవర్గ సభ్యులను కూడా నియమించే ఆలోచనలో ఉన్నారు.

ఇక రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్థానంలో కొత్తగా బీసీ వర్గాలకు ఈ పదవి ఇవ్వాలని పార్టీ అధిష్టానం ఆలోచిస్తున్నట్లు సమాచారం. అనేక మందితో చర్చించిన తర్వాత పార్టీ నాయకత్వం ఈటల రాజేందర్ పేరు ఖరారు చేసినట్లుగా పార్టీలో చర్చ నడుస్తోంది. ఇదే సమయంలో మరో ఇద్దరు నేతలు చివరి ప్రయత్నాలు చేస్తున్నారు. అధిష్టానం నిర్ణయంలో ఎలాంటి మార్పు లేకపోతే ఈటల రాజేందర్ తెలంగాణ బీజేపీ కొత్త సారథిగా నియమితులు అవ్వడం ఖాయమనే అభిప్రాయం పార్టీ శ్రేణుల నుంచి వ్యక్తమవుతోంది.

# లావణ్య, రాజ్ తరుణ్ కేసులో ట్విస్ట్..

## వెలుగులోకి 200కుపైగా వీడియోలు

హీరో రాజ్ తరుణ్ ,లావణ్య కేసు విషయంలో కీలక అప్‌డేట్ వచ్చింది. మస్తాన్ సాయిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాజ్ తరుణ్ తనతో విడిపోవడానికి కారణం మస్తాన్ సాయి అని లావణ్య తన ఫిర్యాదులో తెలిపింది. ఈ ఘటనపై నార్సింగి పోలీసులు వెంటనే చర్య తీసుకొని మస్తాన్ సాయిని అదుపులోకి తీసుకున్నారు.

లావణ్య ఇచ్చిన ఫిర్యాదుల ప్రకారం, మస్తాన్ సాయి వివిధ అమ్మాయిలతో సన్నిహితంగా ఉండగా, వారి వ్యక్తిగత వీడియోలను రికార్డ్ చేశాడని తెలిపింది. ఆ వీడియోలను ఉపయోగిస్తూ బ్లాక్‌మెయిల్ చేస్తూ, సాయి వారిని ఆందోళనకు గురిచేసేవాడని ఆమె వెల్లడించింది. ఈ క్రమంలోనే మస్తాన్ సాయి రికార్డ్ చేసిన వీడియోలను లావణ్య పోలీసులకు అందజేసింది.

మస్తాన్ సాయిపై ఆరోపణలు..

మస్తాన్ సాయి గతంలో కూడా డ్రగ్స్ కేసులో అరెస్ట్ అయ్యాడు. ఆ క్రమంలో ఏపీ పోలీసులు కూడా అతనిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారు. ఆయనపై లావణ్య ఆరోపణలు పెరిగిన తర్వాత, మస్తాన్ సాయి హార్డ్ డిస్క్ లో 200కు పైగా వీడియోలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. లావణ్యకు సంబంధించిన కొన్ని వీడియోలను అతడు రికార్డ్ చేశాడని, ఆ వీడియోలను ఉపయోగించి మస్తాన్ సాయి ఆమెను బ్లాక్‌మెయిల్ చేసే ప్రయత్నం చేశాడని పోలీసులు చెబుతున్నారు.

వీరి వీడియోలు సైతం..

అంతేకాదు హీరో నిఖిల్, వరలక్ష్మి టిఫిన్స్ ప్రభాకర్ రెడ్డికి చెందిన ప్రైవేటు వీడియోలు సైతం మస్తాన్ సాయి హార్డ్ డిస్కులో ఉన్నట్లు లావణ్య తెలిపింది. మస్తాన్ సాయి ఇంటికి వెళ్లి హార్డ్ డిస్క్‌ను తీసుకొచ్చినట్లు లావణ్య వెల్లడించింది. అందులో వందలాది మంది నగ్న వీడియోలు ఉన్నాయంది. ట్రాప్ అయిన అమ్మాయిలకు మస్తాన్ సాయి డ్రగ్స్ ఇచ్చి వారిపై లైంగిక దాడికి పాల్పడేవారని చెప్పింది. యువతులు మత్తులో ఉన్న సమయంలో మస్తాన్ సాయి వారిపై లైంగిక దాడి చేసి వీడియోలను తీసేవాడని లావణ్య చెప్పుకొచ్చింది.

ఆ క్రమంలోనే లావణ్య వీడియోలు సైతం మస్తాన్ సాయి తీసినట్లు తెలిపింది. లావణ్య బట్టలు మార్చుకునే సమయంలో స్పై కెమెరాలు పెట్టి మస్తాన్ సాయి చిత్రీకరించిన వీడియోలు ఉన్నట్లు పేర్కొంది. దీంతోపాటు లావణ్య మాట్లాడుతున్న వీడియో కాల్స్, ప్రైవేట్ వీడియోలు 40కి పైగా ఉన్నట్లు లావణ్య వెల్లడించింది. ఆ క్రమంలో బాధితులను బ్లాక్ మెయిల్ చేస్తూ తన కోరిక తీర్చాలంటూ పలుమార్లు అనేక మందిపై మస్తాన్ సాయి లైంగిక దాడికి పాల్పడేవాడని చెప్పింది. అంతేకాదు హీరో నిఖిల్ ఫోన్ కూడా హ్యాక్ చేసినట్లు లావణ్య ఫిర్యాదులో పేర్కొంది. దీంతో మస్తాన్ సాయి చేతిలో మోసపోయిన బాధితులు ప్రస్తుతం భయాందోళన చెందుతున్నారు.

పోలీసుల విచారణ

అయితే అసలు ఆ 200 వీడియోలలో ఇంకా ఎవరెవరు ఉన్నారనేది ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఆ వీడియోల ద్వారా ఇంకా ఎంత మంది వెలుగులోకి వస్తారు, మస్తాన్ సాయి ఇంకా ఎవరెవరిని బ్లాక్ మెయిల్ చేశారనేది తెలియనుంది. మస్తాన్ సాయి గతంలో కూడా వరలక్ష్మి టిఫిన్ సెంటర్ కేసులో అరెస్ట్ అయ్యాడు. ప్రస్తుతం నార్సింగి పోలీసులు మస్తాన్ సాయిపై విచారణ చేపట్టారు. అతనిపై మోసం, బ్లాక్‌మెయిల్ వంటి ఇతర నేరాలు చేర్చే అవకాశం ఉంది. ఈ కేసులో మరిన్ని వివరాలు త్వరలో వెలుగులోకి రానున్నాయి.

# తెలంగాణపై కేంద్రానిది సవతి తల్లి ప్రేమ..

## చూస్తూ ఊరుకోం: మంత్రి తుమ్మల

కేవలం బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలకు తప్ప కేంద్ర బడ్జెట్లో ఇతర స్టేట్లకు నిధులు కేటాయించలేదని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అసహనం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్?లో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా కేంద్రం అన్యాయం చేసిందని ఆరోపిస్తూ టీపీసీసీ సోమవారం (ఫిబ్రవరి 3) రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చింది.

ఇందులో భాగంగా నిరసనలో పాల్గొన్న మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్లో బయ్యారం స్టీల్ ప్లాంట్, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కేటాయింపులు లేవు.. రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాలు, రైల్వే లైన్లు, ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. బడ్జెట్లో తెలంగాణకు జరిగిన అన్యాయానికి నిరసనగా అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రం అందజేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాలని.. అలా కాకుండా పక్షపాతం వహించడం మంచిది కాదని హితవు పలికారు.

కేంద్రానికి తెలంగాణ కట్టే పన్ను ఎంత..? తిరిగి మీరు రాష్ట్రానికి ఇచ్చే నిధులెన్ని..? అని ప్రశ్నించారు. మా పన్నులు వేరే రాష్ట్రాలకు ఇస్తూ చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల పట్ల పక్షపాతం చూపడం ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమన్నారు. తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని విమర్శించారు. మా రాష్ట్ర హక్కు?గా తెలంగాణకు బడ్జెట్ కేటాయించాలని ప్రధాని మోడీని డిమాండ్ చేస్తున్నామన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు.

# కూటమి అభ్యర్థుల ఘన విజయం..

## పోటీ చేసిన అన్ని స్థానాల్లో గెలుపు..

గుంటూరు నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అదరగొట్టారు. ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీకి చెందిన మొత్తం ఆరుగురు అభ్యర్థులు పోటీ చేసి, అందరూ విజయం సాధించారు. దీంతో గుంటూరు నగరంలో టీడీపీ అభ్యర్థులతోపాటు కూటమి అభ్యర్థులు కూడా పుంజుకున్నారని తెలుస్తోంది.

ఈ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థుల వివరాలు..

ఈరంటి వర ప్రసాద్ – టీడీపీ
కొమ్మినేని కోటేశ్వరరావు – టీడీపీ
నూకవరపు బాలాజీ – టీడీపీ
ముప్పవరపు భారతి – టీడీపీ
షేక్ మీరావలి – టీడీపీ
దాసరి లక్ష్మి దుర్గ – జనసేన

గెలిచిన వారికి..

దీంతో ఈసారి గుంటూరు నగరంలో ఎంచుకున్న ఆరుగురు అభ్యర్థుల విజయం ఈ పార్టీల పట్ల మరింత ఆదరణ వచ్చిందని చెప్పవచ్చు. టీడీపీ అభ్యర్థుల విజయాలు పార్టీలో మరింత ఉత్సాహాన్ని పెంచాయి. ఈ అభ్యర్థుల విజయంతో గుంటూరు నగరంలో టీడీపీ రాజకీయ ప్రస్థానం మరింత బలపడినట్లయింది. టీడీపీకి చెందిన ఈ అభ్యర్థులు తమ పోటీలో ఇతర పార్టీ అభ్యర్థులను బీట్ చేసి గెలుపొందారు. ఈ విజయం నేపథ్యంలో ఇతర టీడీపీ నేతలు గెలిచిన వారిని ప్రశంసిస్తున్నారు. ఫోన్లు చేయడంతోపాటు సోషల్ మీడియా వేదికగా ట్వీట్లు చేసి మెచ్చుకుంటున్నారు.

జనసేన అభ్యర్థి గెలుపు

జనసేన పార్టీకి చెందిన దాసరి లక్ష్మి దుర్గ ఈ ఎన్నికలో విజయం సాధించి, పార్టీకి గుంటూరు నగరంలో మరింత ఉత్సాహాన్ని కలిగించారు. ఆమె గెలుపు, జనసేన పార్టీకి మరింత గౌరవం తెచ్చినట్లు చర్చలు జరుగుతున్నాయి. దీంతోపాటు జనసేన పార్టీ కార్యకర్తలు కూడా ఈ విజయం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గెలిచిన అభ్యర్థులు ఏమన్నారంటే..

ఈ విజయం గుంటూరు నగర పాలక సంస్థలో ఆర్థిక అభివృద్ధి, స్థానిక సమస్యలపై మరింత శ్రద్ధ పెట్టే విధానంలో మార్పులు తెచ్చే అవకాశం ఉంటుంది. అలాగే ఇది స్థానిక నాయకత్వంలో పార్టీలు నిర్వహించే కార్యాలయాలు, ప్రణాళికలకు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకునే ఛాన్స్ ఉంటుంది. ఈ సందర్భంగా ఈ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత గుంటూరు నగర పాలక సంస్థలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని గెలిచిన అభ్యర్థులు చెబుతున్నారు.

# కులగణనపై కాంగ్రెస్ కాకిలెక్కలు

## బీసీ రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో బిల్లు పెట్టాలి: ఎమ్మెల్సీ కవిత

మొదటి పేజీ తరువాయి

2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో 83 లక్షల ఇండ్లు, 3.5 కోట్ల జనాభా ఉన్నట్లు తేలిందని చెప్పారు. 2014లో నాటి సీఎం కేసీఆర్ నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 1.03 కోట్ల ఇండ్లు, 3 కోట్ల 68 లక్షల జనాభా అని తేలిందని వెల్లడించారు. అప్పుడు నాలుగేండ్ల వ్యవధిలో చేసిన సర్వేలోనే 20 లక్షల ఇండ్లు, పెరిగాయి. 2014–2024 వరకు పదేండ్లలో ఎన్ని ఇండ్లు, ఎంత జనాభా పెరిగి ఉండాలన్నారు. ఎన్ని కుటుంబాలు పెరగాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల చేసిన సమగ్ర కుల గణనతో కోటి 15 లక్షల ఇళ్లు ఉన్నాయని, రాష్ట్ర జనాభా 3 కోట్ల 70 లక్షలు అని చెబుతున్నదని తెలిపారు. 2011 నుంచి 14 వరకు 20 లక్షల ఇండ్లు పెరిగితే.. 2014 నుంచి పదేండ్లలో సుమారు 60 లక్షల కుటుంబాలు పెరగాలన్నారు. ఏ లెక్కన చూసినా తెలంగాణలో 50 నుంచి 52 శాతం బీసీలు ఉన్నట్లు తెలుస్తుందని వెల్లడించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం 46.2శాతం ఉన్నట్లు తేల్చడం బాధాకరమని చెప్పారు. ఇది ఎంతవరకు సబబని సీఎం రేవంత్ రెడ్డి గుండెమీద చేసుకుని చెప్పాలన్నారు. ఈ కాకి లెక్కలతో అయినా బీసీల రిజర్వేషన్ల పెంచడం కోసం అసెంబ్లీలో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లను పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇదే తరహా మోసాన్ని బీహార్, కర్ణాటకలో చేసిందని విమర్శించారు. తెలంగాణలో కూడా మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

సకల జనుల సర్వేకు, ఇప్పటి ఈ సర్వేకు 21 లక్షల బీసీ జనాభా తేడా కనిపిస్తున్నదని చెప్పారు. సకల జనుల సర్వేలో ఓసీల జనాభా చాలా తక్కవ అని తేలిందని, ఇప్పుడు చాలా ఎక్కువగా కనిపిస్తున్నదని వెల్లడించారు. దీని వెనుకున్న మతలబు ఏమిటో ప్రభుత్వం చెప్పాలన్నారు. కేవలం ఓసీల జనాభా పెరిగి బీసీ, ఎస్సీ, ఎస్టీల జనాభా తగ్గుతుందా అని ప్రశ్నించారు. సకల జనుల సర్వే ద్వారా కేసీఆర్ మొదటి అడుగు వేశారని, ఆ సర్వే డేటా ఆధారంగా కేసీఆర్ అనేక పథకాలు, కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు.

తెలంగాణ జాగృతి, బీసీ సంఘాలు, రాజకీయ పార్టీలు చేసిన ఉద్యమాల వల్ల బీసీ జనాభా వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేసిందన్నారు. దీన్ని ప్రజాస్వామికవాదులంతా స్వాగతించాలని చెప్పారు. తెలంగాణ జాగృతి ఉద్యమాలకు తలొగ్గిన రాష్ట్ర ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. డెడికేటెడ్ కమిషన్ ద్వారానే కులగణన జరగాలని కోరినా ప్రభుత్వం ప్లానింగ్ శాఖ చేత సర్వే చేయించిందని విమర్శించారు. సర్వే సరిగ్గా జరలేదని ప్రతి ఒక్కరి మనసుల్లో ఉందని చెప్పారు. తమ ఇండ్లకు సర్వే కోసం రాలేదని ప్రతీ గ్రామంలో చాలా మంది అంటున్నారని వెల్లడించారు. సర్వే సరిగ్గా జరగకపోతే డేటా వాస్తవమైనదా కాదా అన్న అనుమానాలు కలుగుతున్నాయని వెల్లడించారు. బీసీల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం సర్వే డేటాను సమీక్షకు పెట్టాలని డిమాండ్ చేశారు. 3.5 కోట్ల సర్వే పత్రాలను ప్రజల స్క్రూటినికీ అందుబాటులోకి పెట్టాలని, స్క్రూటినీకి 15 రోజుల సమయం ఇవ్వాలన్నారు. అసెంబ్లీలో దీనిపై కేవలం స్వల్పకాలిక చర్చ పెడుతామని ప్రభుత్వం చెప్పడం బాధాకరమని చెప్పారు. బీసీలంటే అంత చిన్న చూపు ఎందుకని ప్రశ్నించారు. చిన్న చర్చ పెట్టి ఏం లాభం చేస్తారని నిలదీశారు. బీసీ అంశాలు, ఎస్సీ వర్గీకరణ అంశంలో రాజకీయాలు తగదన్నారు.

# కుల గణన సర్వేలో పాల్గొనకపోతే

## మళ్లీ డిటైయిల్స్ ఇవ్వొచ్చు: మంత్రి పొన్నం

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేపై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. గాంధీభవన్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో కుల గణన ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్రంలో 96 శాతం ఆర్థిక, సామాజిక సర్వే చేశామని చెప్పారు. కుల గణన సర్వేలో పాల్గొనని వారు అధికారులకు మళ్లీ వివరాలు ఇవ్వొచ్చని తెలిపారు.

బీసీ రిజర్వేషన్లపై అన్ని పార్టీల స్టాండ్ ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. కుల గణనపై తప్పుడు వార్తలు వ్యాప్తి చేస్తే.. అది బలహీన వర్గాలపై దాడి చేసినట్లేనని పేర్కొన్నారు. ఎంతో కాలంగా పెండింగ్లో ఉన్న కుల గణనను మేం పూర్తి చేశామని.. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు చేయనివాళ్లు ఇప్పుడు మమ్మల్ని విమర్శించడమేంటని మండిపడ్డారు. కుల గణనపై ప్రతి పక్షాల విమర్శలను బీసీలపై దాడి గానే చూస్తామన్నారు. కుల గణనపై ప్రతిపక్షాల విమర్శలను ధీటుగా ఎదుర్కొంటామని తేల్చి చెప్పారు.

అన్ని వర్గాలకు ఫలితాలు అందేవరకు పోరాటం ఆగదన్నారు. కుల గణన సర్వేలో కేసీఆర్ ఫ్యామిలీలో ఎమ్మెల్సీ కవిత ఒక్కరే అధికారులకు డిటైయిల్స్ ఇఛ్చారని తెలిపారు. కొన్నిచోట్ల కుల గణన కోసం అధికారులు వస్తే కుక్కలను వదిలారని ఆగ్రం వ్యక్తం చేశారు. సర్వేలో తప్పులు జరిగినట్లు ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు మంత్రి పొన్నం ప్రభాకర్. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కుల గణన సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. విజయవంతంగా కుల గణనను పూర్తి చేసిన ప్లానింగ్ కమిషన్.. ఈ రిపోర్టును కేబినెట్ సబ్ కమిటీకి అందజేసింది.

దీంతో రాష్ట్రంలో ఏ వర్గం ప్రజలు ఎంత శాతం ఉన్నారనేది తేలిపోయింది. కుల గణన నివేదికకు ఈ నెల 5వ తేదీన కేబినెట్, అసెంబ్లీ ఆమోదం తెలపనున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కుల గణనపై ప్రతిపక్షాలు విమర్శలు ఎక్కు పెట్టాయి. కుల గణన సర్వే సరిగ్గా నిర్వహించలేదని.. రిపోర్టు తప్పుల తడక అని ఆరోపణలు చేస్తున్నాయి ప్రతిపక్షాలు. ఈ క్రమంలో కుల గణన సర్వేపై ప్రతిపక్షాల వి మర్శలకు మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు.

# కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ప్రశంసించిన ఉపరాష్ట్రపతి ధన్కర్..

మొదటి పేజీ తరువాయి

ఒకే వేదిక నుంచి అవసరమైన అన్ని అనుమతులను పొందేందుకు వీలు కల్పించడం ద్వారా ఆమోద ప్రక్రియను సులభతరం చేసే పరివర్తనాత్మక చొరవ అయిన వినూత్న సింగిల్ విండో క్లియరెన్స్ సిస్టమ్‌ను ప్రారంభించడాన్ని ధంఖర్ ప్రత్యేకంగా ప్రశంసించారు. సింగిల్ విండో క్లియరెన్స్ సిస్టమ్ అమలుకు సంబంధించి రాజ్యసభలో డాక్టర్ దినేష్ శర్మ లేవనెత్తిన ప్రశ్నకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమాధానమిస్తూ.. బొగ్గు రంగంలో కొనసాగుతున్న డిజిటల్ పరివర్తనను ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ రంగం దాని ఎండ్–టు–ఎండ్ మైనింగ్ ప్రక్రియలను విస్తృతంగా డిజిటలైజేషన్ చేస్తోందని, దీని వలన పారదర్శకత, జవాబుదారీతనం గణనీయంగా పెరుగుతుందని ఆయన నొక్కిచెప్పారు. వ్యవస్థలోని వివిధ మాడ్యూల్స్ విజయవంతంగా ప్రారంభించబడ్డాయని కిషన్ రెడ్డి తెలియజేశారు. ఈ వ్యవస్థ పర్యావరణం, అటవీ %–% వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ పరివేష్ 1.0 పోర్టల్‌తో విజయవంతంగా అనుసంధానించినట్లు తెలిపారు. ఇంకా, ఇది రాబోయే ఎన్విరాన్‌మెంట్ 2.0 పోర్టల్‌తో అనుసంధానించబడుతుందని.. తగిన సమయంలో పూర్తిగా అమలు చేయనున్నట్లు తెలిపారు.

2015లో ప్రవేశపెట్టిన వేలం విధానం ద్వారా ఏర్పడిన పారదర్శకతను మరింత పెంచడంలో సింగిల్ విండో క్లియరెన్స్ వ్యవస్థను ప్రవేశపెట్టడం ఒక ముఖ్యమైన ముందడుగు అని మంత్రి కిషన్ రెడ్డి నొక్కి చెప్పారు. ఈ వ్యవస్థను మెరుగుపరచడానికి, కేటాయింపు పొందినవారికి సజావుగా పనిచేయడానికి బలమైన మద్దతును అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన సభకు హామీ ఇచ్చారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో.. దేశీయ బొగ్గు రంగాన్ని బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు, సంస్కరణలను అమలు చేసిందని కిషన్ రెడ్డి ప్రస్తావించారు. 2014 కి ముందు బొగ్గు బ్లాకులను ఏకపక్షంగా కేటాయించారని, దీని వల్లే అపఖ్యాతి పాలైన కోల్‌గేట్ కుంభకోణం జరిగిందని ఆయన ఎత్తి చూపారు. అయితే, వేలం వ్యవస్థ ప్రారంభమైనప్పటి నుంచి పారదర్శక వేలం ప్రక్రియ లేకుండా ఏ బొగ్గు బ్లాకును కేటాయించలేదు.. ఇది పారదర్శకత, జవాబుదారీతనానికి కట్టుబడి ఉండేలా చేస్తుందన్నారు.

కేంద్ర మంత్రి సమాధానం చివరలో.. ఉపరాష్ట్రపతి ఉత్తరప్రదేశ్ కు చెందిన రాజ్యసభ సభ్యుడు దినేష్ శర్మను.. మీరు సమాధానంతో సంతృప్తి చెందారా..? అని ప్రశించారు. “నేను ఈ సమస్యను చాలా నిశితంగా పరిశీలించాను.. మంత్రిత్వ శాఖ కొంత అద్భుతమైన పని చేసినట్లు కనిపిస్తోంది” అని డాక్టర్ శర్మ సమాధానమిచ్చారు. “సింగిల్ విండో బొగ్గు వ్యవస్థ అద్భుతమైనది %–% గనులు మన సహజ సంపద. మంత్రిని అభినందించాలని నేను భావిస్తున్నాను” అని ఉపరాష్ట్రపతి వ్యాఖ్యానించారు.

“రాజ్యసభలో ఈరోజు ఎంపీ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, ఈ రంగంలో పారదర్శకతను పెంపొందించడానికి చేపట్టిన కార్యక్రమాలను నేను హైలైట్ చేసాను. సింగిల్ విండోను ప్రశంసించినందుకు ఉపరాష్ట్రపతికి కూడా నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను” అని జి కిషన్ రెడ్డి ట్వీట్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో.. భారతదేశ మైనింగ్ రంగం సామర్థ్యం, పారదర్శకతను పెంచడానికి అనేక సంస్కరణలు చేసిందని కిషన్ రెడ్డి వివరించారు.

# మేజిస్ట్రేట్ ముందు తిట్టుకొన్న మోహన్ బాబు, మనోజ్

మొదటి పేజీ తరువాయి

ఇంతకీ ఏం జరిగిందంటే..

ఇటీవల మంచు మోహన్ బాబు ఫ్యామిలీలో వివాదాలు చెలరేగాయి. దీంతో మంచు మోహన్ బాబు, ఆయన చిన్న కుమారుడు మంచు మనోజ్ మధ్య దూరం పెరిగింది. ఆ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు తనపై దాడి చేశారని.. తనకు, తన భార్య మౌనికకు ప్రాణ హాని ఉందంటూ మంచు మనోజ్.. పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఇది జరిగిన కొద్ది నిమిషాలకే అతడి తండ్రి మోహన్ బాబు.. రాచకొండ పోలీస్ కమిషనర్‌కు లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. తన కుమారుడు మంచు మనోజ్, అతడి భార్య మౌనిక ద్వారా తనకు ప్రాణ హాని ఉందంటూ ఆ ఫిర్యాదులో స్పష్టం చేశారు. దీంతో ఇరు వర్గాల ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# జైలు నుంచి బెయిల్‌పై వచ్చి..

## వృద్ధురాలిపై రేప్, హత్య

మొదటి పేజీ తరువాయి

తొలుత అనుమానాస్పద మృతిగా పోలీసులు భావించినప్పటికీ, ఆ వృద్ధురాలు ఓ ఉన్మాది ఈ ఘాతుకానికి బలైపోయినట్లు గుర్తించారు. నిందితుడు మంజు 2023లో ఇదే తరహా ఓ మహిళపై అత్యాచారం చేసి హత్య చేసినట్టు పోలీసులు తెలిపారు. ఆ తర్వాత 2024లో కూడా ఓ మహిళపై అత్యాచారానికి ఒడిగట్టాడు. ప్రస్తుతం ఆ కేసులో జైలులో ఉన్న అతడు మూడు రోజుల క్రితమే బెయిల్‌పై విడుదలయ్యాడు. వృద్ధురాలు స్థానికంగా స్వీపర్‌గా పనిచేసుకుంటూ గుడిసెలో నివాసం ఉంటోంది. శనివారం రాత్రి వృద్ధురాలిపై అత్యాచారం, హత్యకు ఒడిగట్టిన నిందితుడు వెంటనే పరారయ్యాడు.

ఆదివారం ఉదయం పనికి రాకపోవడంతో, అదే గ్రామంలో ఉంటున్న ఆమె కుమార్తె గుడిసె వద్దకు వచ్చి చూడగా.. వృద్ధురాలు రక్తం మరకలతో పాటు ఒంటిపై గాట్లతో కనిపించింది. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. శనివారం రాత్రి సాంబ, మంజు అనే వ్యక్తులు అనుమానంగా తిరగడం గమనించినట్లు స్థానికులు తెలపడంతో పోలీసులు ఆ దిశగా విచారణ జరిపి మంజు రేప్ చేసినట్లు నిర్ధారణకు వచ్చారు. ఘటనా స్థలాన్ని ట్రైనీ ఎస్పీ దీక్షిత, డీఎస్పీ భానోదయ పరిశీలించారు. ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలం వద్ద క్లూస్ టీం వేలిముద్రలు సేకరించింది. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించినట్లు ఎస్ఐ మధుపవన్ తెలిపారు. వరుస అత్యాచారాలు, హత్యల నేపథ్యంలో మంజు నేర ప్రవృత్తిపై పోలీసు వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. నిందితుడు మంజును త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.

## బీసీ జనాభాపై కాంగ్రెస్ పెద్ద కుట్ర?

మొదటి పేజీ తరువాయి

కచ్చితమైన లెక్కలు రావాలంటే ఇప్పటికే అందుబాటులో ఉన్న గణాంకాలతో క్షేత్రస్థాయిలో తులనాత్మక అధ్యయనం చేయాలని, అదే సమయంలో కొత్త కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేస్తే సరిపోతుంది. కానీ దీనికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటి సర్వే చేసింది. ఇందులో ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితుల గురించి కంటే ఆస్తులు, అప్పుల గురించి ఎక్కువగా ప్రశ్నలు పొందుపరిచింది. సంక్షేమ పథకాలను కూడా ప్రభుత్వం దీనితో ముడిపెట్టింది. దీంతో ఈ సర్వే ద్వారా కొందరిని సంక్షేమ పథకాలకు దూరం చేస్తుందనే ప్రచారం విస్తృతంగా జరిగింది. ప్రభుత్వం దీనిపై వివరణ ఇచ్చినా... క్షేత్రస్థాయిలో 75 ప్రశ్నలతో కుటుంబ సర్వేపై ఎన్యుమరేటర్లు అడిగిన ప్రశ్నలు చూసిన జనాలు సర్వేకు దూరంగా ఉన్నారు. స్టిక్కరింగ్ చేయడానికి కూడా అంగీకరించలేదు.

సమగ్ర కుటుంబ సర్వే జరిగిన విధానం తదితర వివరాలు కూడా ఇందులో పొందుపరిచారు. భారతదేశంలో మరే రాష్ట్రంలో జరగని విధంగా, గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకే రోజు తెలంగాణ రాష్ట్రంలో 4 లక్షల మంది ఉద్యోగులు 1.09 కోట్ల కుటుంబాల వివరాలను సేకరించింది. కేసీఆర్ ప్రభుత్వం ఒక్కరోజులో చేసిన సమగ్ర కుటుంబ సర్వే ఎంత సక్కగ చేసింగ్రో చూడాలి అంటున్నారు. కులగణన పేరుతో జరిగిందంతా ఒక ప్రహసనంగా ఉన్నది తప్పా సమగ్రంగా లేదన్ని అభిప్రాయపడుతున్నారు. తెలంగాణలో రాష్ట్రంలో బీసీలు 55 శాతానికి పైగా ఉంటారని, సరిగ్గా జనగణన జరిపితే నిజాలు నిగ్గు తేలుతాయంటున్నారు. కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా కులగణన చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. తెలంగాణలో చేసే సర్వేనే ప్రామాణికం అంటున్నది. కానీ రేవంత్ ప్రభుత్వం చేసిన సర్వేలో బీసీల జనాభా తక్కువ చూపెట్టిందని బీసీ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. అసంపూర్ణంగా, అసమగ్రంగా చేసిన ఈ కులగణన సర్వే లెక్కలనే ప్రమాణికంగా జీహెచ్ఎంసీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ఖరారు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నది. అదే జరిగితే బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బీసీ కుల సంఘాల నేతలు అంటున్నారు. ప్రత్యేక డ్రైడ్ నిర్వహించి సంపూర్ణంగా సర్వే చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆ తర్వాతే రిజర్వేషన్లు ఖరారు చేయాలని.. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని బీసీ సంఘాలు హెచ్చరిస్తున్నాయి.


## గ్రూప్-1 ఫలితాల విడుదలకు లైన్ క్లియర్

మొదటి పేజీ తరువాయి

కాగా, తెలంగాణలో గ్రూపు-1 మెయిన్ పరీక్షలు అక్టోబర్ 21 నుంచి 27 వరకూ జరిగిన సంగతి తెలిసిందే. మ్మొత్తం 563 పోస్టులకు గానూ 31,403 (క్రీడల కోటా కలిసి) మంది అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలకు అర్హత సాధించారు. అయితే జీవో 29ను రద్దు చేయాలని, గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని పలువురు అభ్యర్థులు చేపట్టిన ఆందోళనలు తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీశాయి. రాజకీయ పార్టీలు సైతం వారికి మద్దతు తెలపడంతో ఆందోళనలు తీవ్రతరం అయ్యాయి. హైదరాబాద్ నగరంలో లాఠీ ఛార్జ్ సైతం జరిగింది. పెద్దఎత్తున నిరసన తెలిపిన అభ్యర్థులు ఈ అంశంపై హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ వారికి ఎదురుదెబ్బ తగలడంతో సుప్రీంకోర్టుకు వెళ్లారు. పరీక్షలు మ్మొదలైన రోజే కేసు విచారణకు రావడంతో పరీక్షలు నిలిపివేసేందుకు కోర్టు అనుమతి ఇవ్వలేదు. దీంతో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. అయితే నేడు విచారణ చేపట్టిన ధర్మాసనం అభ్యర్థుల పిటిషన్లు కొట్టివేసింది.

## శాఖల వారీగా ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను సమర్పించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ జిల్లా అధికారులను ఆదేశం.

వికారాబాద్,03 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): సోమవారం ప్రజావాణిలో భాగంగా జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ,కారుణ్య నియామకాల్లో భాగంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న టైపిస్టు, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల భర్తీకి సంబందించి వివరాలను రోస్టర్ పాయింట్ వారీగా ఖాళీల వివరాలను వెంటనే సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణిలో 106 దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణిలో కారుణ్య నియామకాలు, ఆపద్బంధువు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్, రైతు భరోసా, రుణ మాఫీ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డు, వ్యవసాయ , పశు సంవర్ధక శాఖ లకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యల పరిష్కార దిశగా కృషి చేయాలని కలెక్టర్ అధికారుల సూచించారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ , అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, ఆర్డిఓ వాసు చంద్ర లు ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరించారు.



## రామగుండం ప్రాంతంలో అతిపెద్ద దాసాంజనేయ విగ్రహ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసి చేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ వారి సతీమణి మనాలి ఠాగూర్



రామగుండం,03 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):దేశంలోనే అతిపెద్ద దాసాంజనేయ స్వామి విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన

రాముడు నడిచిన నేలగా గుర్తింపుపొందిన రామగుండం ప్రాంతంలో దేశంలోనే అతిపెద్ద దాసాంజనేయ విగ్రహ నిర్మాణానికి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ దంపతులు శంకుస్థాపన చేశారు. వసంత పంచమి సందర్భంగా 108 అడుగుల దాసాంజనేయ స్వామి విగ్రహాన్ని ఎనిమిది కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయనున్నామని రామగుండం ప్రాంతంలో ఇప్పటికే రాముని గుండాల పేరిట ఆధ్యాత్మిక కేంద్రం ఉండగా, ఇటీవల 1800 సంవత్సరాల క్రితం నాటి పురాతన ఆంజనేయస్వామి విగ్రహం బయటపడింది.ఈ క్రమంలో ఆవిగ్రహనికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ ప్రాంతంలో 108 అడుగుల దాసాంజనేయ స్వామి విగ్రహాన్ని నిర్మించటతో పాటు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి చూపిస్తాం అని అన్నారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ విభాగాల అధ్యక్షులు భక్తులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు



## ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**

భద్రాద్రి కొత్తగూడెం ,03 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసిన అభ్యర్థులను వివరాలను అడిగి తెలుసుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని శాఖల వారీగా అధికారులను ఆదేశించారు.

గ్రీవెన్స్ లో కొన్ని ఫిర్యాదులు....

దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామానికి చెందిన ఇస్లావత్ బదిలీ w/o రాములు నా భర్త మూడు సంవత్సరాల క్రితం చనిపోయినాడు అని అతని యొక్క వృద్ధాప్య పెన్షన్ రద్దు చేయబడినదని వయోభారం వల్ల నాకు పక్షవాతం వచ్చినదని కావున నాకు వృద్ధాప్య పింఛను మంజూరు చేయగలరని చేసిన దరఖాస్తులు పరిశీలించి తగు చర్యలు నిమిత్తం డి ఆర్ డి ఓ కి ఎండార్స్ చేశారు.పాల్వంచ మండలం పిల్లవాగు గ్రామానికి చెందిన ఆదివాసి గిరిజన చిన్న సన్నకారు రైతులకు ఉన్నటువంటి భూమిలో వర్షం నీటి మీద ఆధారపడి పంటలు పండిస్తున్నామని, వర్షాలు లేకపోవడం వల్ల మా పొలంలో వేసిన పంటలు మొత్తం ఎండిపోవడం జరిగిందని మా యొక్క స్థితిగతులను పరిశీలించి మా పొలాల్లో వ్యవసాయ బోర్లు మరియు విద్యుత్ సౌకర్యం కల్పించాలని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల



నిమిత్తం ఐటీడీఏ పీవో కి ఎండార్స్ చేశారు.

కొత్తగూడెం మండలం రామవరం 10వ వార్డు మరియు 6వ వార్డు మధ్యలో ఉన్న వాగు ( కుంట) యందు వ్యర్థాల వలన గ్రామ ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతూ అందులో నివసిస్తున్న విషపురుగులు, పాములు, దోమల వలన వచ్చే రోగాలతో అనేక రకములుగా ఇబ్బందులు పడుతున్నామని అట్టి కుంట నందు తుమ్మ చెట్లు ఏపుగా పెరిగి అందులో అసాంఘిక కార్యక్రమాలు మరియు చీకటి సమయంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నదని కొత్తగూడెం మున్సిపాలిటీ వారికి ఆదేశాలు జారీ చేసి అట్టి కుంటను శుభ్రం చేసి గ్రామ ప్రజలకు దాని వలన వచ్చే రోగాల బారి నుండి కాపాడగలరని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ కు ఎండార్స్ చేశారు. కొత్తగూడెం మండలం 36వ వార్డుకు చెందిన అజ్మీర సురేష్ s/o కిషన్ నాకు ఎటువంటి ఉపాధి లేక



రోజు కూలి పనులకు వెళ్తున్నానని ఏదైనా ఎస్టీకి సంబంధించిన స్కీం కింద స్వయం ఉపాధికి ముద్ర లోన్ ఇప్పించగలరని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం గిరిజన సంక్షేమ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు.

కొత్తగూడెం మండలం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని సఫాయి బస్తీ నందు గల మా ఇండ్లపై నుండి విద్యుత్ శాఖ వారు 11 కె వి హెచ్ టి లైన్ వేసి ఉన్నారని దీనివల్ల మాకు ఏ సమయంలోనైనా ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి ఏర్పడిందని మా ఇండ్లపై ఉన్నటువంటి 11 కె వి హెచ్ టి లైను వెంటనే తొలగించుటకు చర్యలు తీసుకోగలరని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం విద్యుత్ శాఖ అధికారులకు ఎండాస్ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన మరియు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కబ్జాలపై బీసీ కాలనీ వాసులు కలెక్టర్ కు కంప్లైంట్...

- పద్మశాలీలను ఇబ్బందులు పెడుతున్నారని ఫిర్యాదు
- కలెక్టరేట్ లో నేరుగా కలిసి ఫిర్యాదు చేసిన పద్మశాలి కులస్తులు
- అండగా నిలిచిన పద్మశాలి జిల్లా కమిటీ
- న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తం
- మేడం మీరే న్యాయం చేయాలంటూ పద్మశాలి కులస్తులు ఆవేదన
- వారం రోజుల్లో చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ...



కమలాపూర్,03 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):కలెక్టర్ మేము వారి ఆగడాలతో బతకలేకపోతున్నాం, ఇక ఇబ్బందులు పడలేం, భూ కబ్జాదారులతో మేము తట్టుకోలేకపోతున్నాం మాకు మీరే న్యాయం చేయాలి అంటూ హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రం బి.సి కాలనీ చెందిన పద్మశాలి కులస్తులు సోమవారం హనుమకొండ కలెక్టర్ ప్రావిణ్యకు ఫిర్యాదు చేశారు... కలెక్టర్ కార్యాలయంలో నేరుగా ఆమెను కలిసిన బీసీ కాలనీకి చెందిన పద్మశాలి కులస్తులు కాలనీలో జరుగుతున్న అక్రమ భూకబ్జాలు, పద్మశాలి కులస్తులపై వేధింపులు, వారి ఆగడాలపై లిఖితపూర్వ ఫిర్యాదు తో పాటు కలెక్టర్ కు తమ గోడును వినిపించారు... 1987లో 122 మంది పద్మశాలి కులస్తులకు ప్రభుత్వం రెండు గుంటల చొప్పున 14 ఎకరాలను కేటాయించి పట్టాలు పంపిణీ చేస్తే కొద్ది సంవత్సరాలుగా కమలాపూర్ లోని ఎస్సి కులానికి చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా ప్రవేశించి భూమి మాది అంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వారి ఇబ్బందులు తట్టుకోలేక మానసిక వేదనకు గురవుతున్నామని, మాకు



చావే శరణ్యం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు... మా జాగల్లో ఇల్లు కట్టుకోవాలన్న వారు తరచూ అడ్డుపడుతూ నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వారి ఆగడాలు తట్టుకోలేక మీకు ఫిర్యాదు చేస్తున్నామని చెప్పారు... వెంటనే వారిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవడంతో పాటు, కబ్జా కు గురైన స్థలాలను సేకరించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని వేడుకున్నారు.. ఈ పద్మశాలీల భూ కబ్జాల సమస్యకు అఖిలభారత హనుమకొండ పద్మశాలి జిల్లా కమిటీ అండగా నిలిచింది. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కబ్జా దారులపై చర్యలు తీసుకోకుంటే కమలాపూర్ లో పోరాటం చేస్తామని, నిరుపేద పద్మశాలి కులస్తులకు న్యాయం జరిగే వరకూ అండగా నిలుస్తామని అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వడ్నాల నరేందర్, జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం తెలిపారు. కలెక్టర్ ప్రావీణ్య వారం రోజుల్లో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిందని,చర్యలకు వెనుకాడిన యెడల పద్మశాలి కులస్తులతో కలిసి ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతామని తేల్చి చెప్పారు... ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు పోరండ్ల కృష్ణ ప్రసాద్, మీడియా కోఆర్డినేటర్ రాజేందర్, ఉపాధ్యక్షులు నల్ల సత్యనారాయణ, వెంగళ వేణుగోపాల్, గజ్వేల్ రవీందర్, వావిలాల మురళి, పద్మశాలి కులస్తులు పాల్గొన్నారు....



## దుండిగల్ మున్సిపల్ కమిషనర్ను కలిసిన కొర్ర ప్రవీణ్ నాయక్

కుత్బుల్లాపూర్,03 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): కుత్బుల్లాపూర్నియోజక వర్గం దుండిగల్ నూతన మున్సిపల్ కమిషనర్ గా వచ్చిన వెంకటేశ్వర్ నాయక్ ను టిఆర్ఎస్వి వైస్ ప్రెసిడెంట్ కొర్ర ప్రవీణ్ నాయక్ ఈరోజు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలలో అర్హమైన పేదవారిని గుర్తించి లబ్ధి చేకూర్చాలని వినతి చేశామని ఈ సందర్భంగా కమిషనర్ సానుకూలంగా స్పందించారన్నారు.

# ఏపీలో కొత్త రైల్వే లైన్..

## రూ.2,545 కోట్లతో.. ఆ రూట్లోనే.. నాలుగేళ్లలో పూర్తి.!



ఆంధ్రప్రదేశ్‌లో పలు రైల్వే ప్రాజెక్టుల పనులు వేగం పుంజుకున్నాయి. తాజాగా ఎర్రుపాలెం- అమరావతి- నంబూరు రైల్వే లైన్ నిర్మాణ పనులపై కీలక అప్ డేట్ వచ్చింది. అమరావతి మీదుగా ఎర్రుపాలెం - నంబూరు కొత్త రైల్వే లైన్ నిర్మాణాన్ని నాలుగేళ్లలో పూర్తి చేస్తామని విజయవాడ డివిజనల్ మేనేజర్ నరేంద్ర పాటిల్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రస్తుతం ట్రాక్ నిర్మాణానికి కావాల్సిన ప్రక్రియ జరుగుతోందని వివరించారు. అమరావతి కొత్త రైల్వే లైన్‌ను రూ.2,545 కోట్లతో చేపడుతున్నట్లు విజయవాడ డీఆర్ఎం తెలిపారు. ఈ రైల్వే లైన్ నిర్మాణానికి 2024 అక్టోబర్‌లో కేంద్ర క్యాబినెట్ ఆమోదించినట్లు వివరించారు. నాలుగేళ్లలో అమరావతి రైల్వే లైన్ నిర్మాణం పూర్తి చేస్తామన్న విజయవాడ డీఆర్ఎం.. ఇది పూర్తి అయితే అమరావతి నుంచి విజయవాడ, గుంటూరు, హైదరాబాద్, చెన్నై ప్రాంతాలతో అనుసంధానం ఏర్పడుతుందన్నారు.

మరోవైపు ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం నుంచి ఏపీలోని నంబూరు వరకూ అమరావతి మీదుగా కొత్త రైల్వే లైన్ నిర్మాణం జరుగనుంది. ఎర్రుపాలెం- నంబూరు అమరావతి రైల్వే లైన్ ప్రాజెక్టును 2018లో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. మొత్తం 57 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ నిర్మాణం జరగనుంది. రైల్వే ట్రాక్ నిర్మాణం కోసం తెలంగాణలోని ఖమ్మం జిల్లాతో పాటుగా ఏపీలోని కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో భూసేకరణ చేయాల్సి ఉండగా.. ఏపీలో భూసేకరణ ఇప్పటికే పూర్తైంది. ఈ ప్రాజెక్టుకు రూ.2, 545 కోట్లు ఖర్చవుతాయని అంచనా కాగా.. గతేడాది అక్టోబర్‌లో కేంద్ర మంత్రివర్గం ఆమోదం కూడా తెలిపింది.

అమరావతి రైల్వే లైన్‌లో రైల్వే శాఖ తొమ్మిది రైల్వేస్టేషన్లను నిర్మించనుంది. ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెంలో ఓ రైల్వేస్టేషన్ నిర్మించనున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా పెద్దాపురం, చెన్నారావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల, కొత్తపేట, వడ్డమాను, అమరావతి, తాడికొండ, కొప్పురావూరులో కొత్త రైల్వేస్టేషన్లు నిర్మించాలని ప్రతిపాదించారు. అమరావతి రైల్వే లైన్ పూర్తి అయితే అమరావతిని చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా వంటి ముఖ్యనగరాలతో అనుసంధానించేలా కేంద్రం అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే నాలుగేళ్లలో అమరావతి రైల్వే లైన్ నిర్మాణం పూర్తి చేస్తామని విజయవాడ డీఆర్ఎం చెప్తున్నారు. ఈ రైల్వే లైన్ పూర్తి అయితే అమరావతికి అనుసంధానం పెరగటంతో పాటుగా తెలంగాణలోని ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ జంక్షన్‌గా మారే అవకాశముంది.

# టీటీడీకి భారీ విరాళం

## 35 ఏళ్ల సర్వీసులో ఆదా చేసిందంతా.. కళ్లుచెదిరే మొత్తం!



కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీనివాసుడికి ప్రపంచవ్యాప్తంగా భక్తులు ఉన్నారు. దేశవిదేశాల నుంచి శ్రీవారి దర్శనం కోసం భక్తులు వస్తుంటారు. శ్రీవారిని దర్శించుకుని తరిస్తుంటారు. అనంతరం తమకు తోచిన మొత్తాన్ని టీటీడీ ట్రస్టులకు విరాళంగా అందిస్తుంటారు. ఆ రకంగా శ్రీవారి దర్శనంతో పాటుగా సామాజిక సేవలోనూ భాగస్వామ్యం పంచుకుంటూ ఉంటారు. తిరుమల శ్రీవారికి సోమవారం అరుదైన విరాళం అందింది. టీటీడీకి ఎన్నో భారీ విరాళాలు అందుతున్నా.. ఈ విరాళం మాత్రం కాస్త ప్రత్యేకంగా, అరుదుగా నిలిచిపోనుంది. ఎందుకంటే ఓ భక్తురాలు తన జీవిత కాలంలో ఆదా చేసిన ప్రతి పైసాను తిరుమల శ్రీవారికి విరాళంగా అందజేశారు.

వివరాల్లోకి వెళ్తే.. రేణిగుంటకు చెందిన సి. మోహన అనే మహిళ విపత్తు అధికారిగా అనేక దేశాలలో పనిచేశారు. 35 ఏళ్ల ఉద్యోగ జీవితంలో మనదేశంతో పాటుగా అల్బేనియా, సౌదీ అరేబియా, యెమెన్ వంటి దేశాల్లో అభివృద్ధి విపత్తు నిర్వహణ రంగంలో పలు హోదాల్లో మోహన పనిచేశారు. అయితే తిరుమల శ్రీవారి భక్తురాలు అయిన మోహన.. తన ఉద్యోగ జీవితంలో ఆదా చేసే ప్రతి పైసా కూడా శ్రీవారికి సమర్పించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆ నిర్ణయం ప్రకారమే తన వృత్తిగత జీవితంలో ఇప్పటి వరకూ ఆదా చేసిన ప్రతి రూపాయి శ్రీవారికి కానుకగా సమర్పించుకున్నారు.

ఈ మొత్తం రూ.50 లక్షలు కాగా.. టీటీడీకి చెందిన శ్రీవెంకటేశ్వర సర్వ శ్రేయాస్ ట్రస్ట్‌కు విరాళంగా అందించారు మోహన. విరాళం తాలూకా మొత్తాన్ని డీడీ రూపంలో టీటీడీ ఏఈవో వెంకయ్య చౌదరి చేతికి అందజేశారు. టీటీడీ ఏఈవో వెంకయ్య చౌదరి, మోహన దాతృత్వాన్ని, శ్రీవారిపై భక్తిని ప్రశంసించారు. మూడున్నర దశాబ్దాలకుపైగా తన వృత్తి జీవితంలో సంపాదించిన ధనాన్ని అనాథలు, పేదలకు ఉపయోగపడాలనే ఆమె నిర్ణయం గొప్పదని ప్రశంసించారు. టీటీడీ విద్యా సంస్థల్లో చదువుతున్న అనాథ, పేద పిల్లల సంక్షేమం కోసం ఈ రూ.50 లక్షలు ఉపయోగించనున్నారు. మరోవైపు మోహన.. సునామీ సమయంలోనూ తన సేవలు అందించారు. పలు దేశాలలో భూకంపాలు, తుఫానులు వంటి ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో ఐక్యరాజ్యసమితి, అమెరికా, బ్రిటిష్ ఛారిటీలతో కలిసి పనిచేశారు.

### టీటీడీకి ద్విచక్ర వాహనం విరాళం

మరోవైపు టీటీడీకి హీరో మోటో కార్ప్ కంపెనీ సోమవారం బైక్ విరాళంగా అందించింది. రూ.1.20 లక్షలు విలువైన హీరో డెస్టినీ వాహనాన్ని టీటీడీకి విరాళంగా అందించింది. శ్రీవారి ఆలయం వద్ద వాహనానికి పూజలు నిర్వహించిన అనంతరం సంస్థ ప్రతినిధులు.. టీటీడీ అధికారులకు తాళాలు అందజేశారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల ఎఫెక్ట్..

## ఆ నిర్ణయాన్ని మార్చుకున్న వైసీపీ..



విద్యార్థులకు వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని కోరుతూ వైసీపీ తలపెట్టిన ఫీజు పోరు కార్యక్రమం వాయిదా పడింది. వాస్తవానికి ఫిబ్రవరి ఐదో తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఫీజు పోరు కార్యక్రమం చేపట్టాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్ణయించారు. ఆ మేరకు వైసీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అయితే పలు జిల్లాలలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో వైసీపీ తన నిర్ణయాన్ని మార్చుకుంది. ఫిబ్రవరి 5న తలపెట్టిన ఫీజు పోరు కార్యక్రమాన్ని మార్చి 12వ తేదీకి వాయిదా వేసింది. రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వైసీపీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, ఫీజు పోరు కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని ఈసీని కోరామని.. అయితే ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి స్పందన రాలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెలిపింది. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత, మార్చి 12వ తేదీన ఫీజు పోరు నిర్వహించాలని నిర్ణయించినట్లు తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. మరోవైపు విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.3,900 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలను టీడీపీ కూటమి ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలంటూ వైసీపీ ఈ ఫీజు పోరు కార్యక్రమానికి పిలుపునిచ్చింది. నిరసన కార్యక్రమాల్లో భాగంగా జిల్లా కలెక్టర్‌లకు వినతి పత్రాలు అందించాలని నిర్ణయించారు. అయితే ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ కార్యక్రమం వాయిదా పడింది.మరోవైపు గతంలో చంద్రబాబు ప్రభుత్వం విద్యార్థులకు రూ.1,780 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెడితే.. తాము అధికారంలోకి రాగానే వైఎస్ జగన్ ఆ బకాయిలు విడుదల చేశారని వైసీపీ చెప్తోంది. తమ హయాంలో 37 వేల పైచిలుకు పాఠశాలలను నాడు నేడు పథకం కింద అభివృద్ధి చేసినట్లు గుర్తు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు అవుతున్నా ఒక్క రూపాయి కూడా విద్యార్తులకు చెల్లించలేదని.. దీంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయని వైసీపీ ఆరోపిస్తోంది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని.. ఏపీ ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తోంది.

# విద్యార్థులకు బిగ్ రిలీఫ్..

## ఒకట్రెండు రోజుల్లో డబ్బులు విడుదల : నారా లోకేష్



రాష్ట్రంలోని విద్యార్థులకు ఏపీ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ శుభవార్త వినిపించారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలపై నారా లోకేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఉండవల్లిలోని నివాసంలో నారా లోకేష్‌తో ఇంజినీరింగ్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఈ భేటీలో కాలేజీ యాజమాన్యాల సమస్యలను మంత్రి నారా లోకేష్‌కు వివరించారు. క్యాలెండర్ ప్రకారం రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని కోరారు. దీంతో ఆర్టీఎఫ్ (రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీజ్) స్కాలర్‌షిప్‌లకు సంబంధించి తొలి విడతలో 788 కోట్ల రూపాయలకు గానూ ఇప్పటి వరకూ రూ.571.96 కోట్లు విడుదల చేసినట్లు నారా లోకేష్ చెప్పారు. మిగతా రూ.216.04 కోట్లను కూడా వచ్చే రెండు, మూడు రోజుల్లో విడుదల చేస్తామని ఇంజినీరింగ్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు.

మరోవైపు వైసీపీ హయాంలో పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఏపీలో విద్యావ్యవస్థ నిర్వీర్యమైందన్న నారా లోకేష్.. విద్యావ్యవస్థలో ప్రాథమిక స్థాయి నుంచే మార్పు తేవాలన్నారు. ఇదే తమ ప్రభుత్వ లక్ష్యమని.. ఆ దిశగా అనేక చర్యలు తీసుకుంటున్నట్లు నారా లోకేష్ చెప్పారు. ఇంటర్ విద్యలో పదేళ్లుగా సంస్కరణలు లేవన్న నారా లోకేష్.. తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అన్ని విద్యాసంస్థల్లో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో పెరగాలని అన్నారు. విద్యావ్యవస్థలో నైతిక విలువలతో కూడిన సంస్కరణలు తేవాలన్నది తమ ఉద్దేశమన్న నారా లోకేష్.. ఈ క్రమంలో ఏవైనా తప్పులు దొర్లితే సరిదిద్దుకోవడానికి సిద్ధమన్నారు.

టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఏకపక్ష నిర్ణయాలకు తావులేదని.. చర్చల ద్వారానే ఏదైనా విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. కాలేజీ యాజమాన్యాలు కూడా ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్ మీద దృష్టిపెట్టాలని నారా లోకేష్ సూచించారు. ఇంజనీరింగ్ కళాశాలల్లో జరిగే ప్లేస్‌మెంట్ల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ ద్వారా తెలియజేయాలని సూచించారు. విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తెస్తామన్న నారా లోకేష్.. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పూర్తైన తర్వాత వర్క్ షాప్ నిర్వహించి ఇంజనీరింగ్ విద్యపై అభిప్రాయాలు తెలుసుకుంటామని ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యాల ప్రతినిధులకు సూచించారు.

# అలా అయితే పులివెందుల ఉపఎన్నిక..!

## రఘురామ ఆసక్తికర వ్యాఖ్యలు

పులివెందుల ఉపఎన్నికపై ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. అసెంబ్లీకి రావాలని రఘురామకృష్ణరాజు సూచించారు. అసెంబ్లీకి వచ్చి ఆయన అభిప్రాయాలు తెలియజేయాలని అన్నారు. అసెంబ్లీకి వచ్చి ప్రజాసమస్యలను లేవనెత్తటం ఎమ్మెల్యేగా ఆయన బాధ్యతని చెప్పారు. వైసీపీకి ప్రతిపక్ష హోదా స్పీకర్, ముఖ్యమంత్రులు ఇచ్చేది కాదన్న రఘురామకృష్ణరాజు.. అది ప్రజలు ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. అలాగే ఎమ్మెల్యే ఎవరైనా లీవ్ అడగకుండా 60 రోజుల పాటు శాసనసభకు హాజరుకాకుంటే అనర్హత వర్తిస్తుందని రఘురామకృష్ణరాజు చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అలా 60 రోజులు అసెంబ్లీకి రాకపోతే అనర్హత వర్తిస్తుందని.. పులివెందులకు ఉపఎన్నిక వస్తుందంటూ రఘురామ కీలక వ్యాఖ్యలు చేశారు. వైఎస్ జగన్ అసెంబ్లీకి రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

మరోవైపు తన కస్టోడియల్ వేధింపుల కేసులో న్యాయం జరుగుతుందనే విశ్వాసాన్ని రఘురామకృష్ణరాజు వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం తనకు న్యాయం జరుగుతుందని నమ్మకం ఉందన్నారు. తన కస్టోడియల్ టార్చర్‌లో సునీల్ కుమార్ పాత్ర ఉందన్న రఘురామకృష్ణరాజు.. దోషులకు శిక్ష పడుతుందనే నమ్మకం తనకు ఉందన్నారు. అలాగే ఈ విషయంలో తన పోరాటం ఆగదని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు స్పష్టం చేశారు. 2024 ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలైన సంగతి తెలిసిందే. కేవలం 11 సీట్లను వైసీపీ పరిమితమైంది.

175 ఎమ్మెల్యే స్థానాలు ఉన్న ఏపీ అసెంబ్లీలో టీడీపీ కూటమికి 164 ఎమ్మెల్యే స్థానాలు దక్కగా.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 11 సీట్లు గెలుచుకున్న సంగతి తెలిసిందే. దీంతో వైసీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కలేదు. అయితే ప్రజాసమస్యలను అసెంబ్లీలో లేవనెత్తడానికి వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలని వైఎస్ జగన్ కోరుతున్నారు. అయితే పదిశాతం సీట్లు రానందున రూల్స్ ప్రకారం ప్రతిపక్ష హోదా ఇవ్వలేమని కూటమి ప్రభుత్వం చెప్తోంది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ కార్యక్రమాలకు వైఎస్ జగన్ దూరంగా ఉన్నారు. ఈ క్రమంలో వైఎస్ జగన్ అనర్హత, పులివెందుల ఉపఎన్నికపై అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



# సింగరేణి సంస్థలో రిటైర్మెంట్ కార్మికుల బెనిఫిట్స్ త్వరగా ఇవ్వాలి

**కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కు మెమోరండం ఇచ్చిన ఐ ఎన్ టి యు సి కొత్తగూడం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్**



భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో,03 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): సింగరేణి సంస్థలో రిటైర్మెంట్ అయిన కార్మికులకు రిటైర్మెంట్ అనంతరం వచ్చే బెనిఫిట్స్ ను త్వరగా ఇచ్చే విధంగా చూడాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సాలెం రాజుకు ఐ ఎన్ టి యు సి కొత్తగూడం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్ మెమోరండం ఇవ్వడం జరిగింది. సింగరేణి సంస్థలో రిటైర్మెంట్ అయినా ఉద్యోగులకు, రిటైర్మెంట్ అనంతరం అందాల్సిన బెనిఫిట్స్ ఇవ్వడంలో చాలా జాప్యం జరుగుతున్నది, దీనివల్ల వారు ఆఫీసుల చుట్టూ తిరిగి ఇబ్బందులకు గురవుతున్నారు, సమయానికి మెడికల్ కార్డు లేక అనారోగ్యంతో ఉన్నప్పుడు వారు ఇబ్బం ది పడుతున్నారు, కావున వారికి త్వరితగతి న బెనిఫిట్స్, మరియు మెడికల్ కార్డు త్వరగా ఇప్పించే విధంగా చూడాలని, రిటైర్మెంట్ కార్మికులకు పెరిగిన రివైజ్డ్ పెన్షన్ తోపాటు, ఏరియర్స్ కూడా వెంటనే కట్టి ఇవ్వాలని కొత్తగూడెం ఏరియా ఐఎన్టియుసి యూనియన్ ద్వారా డిమాండ్ చేస్తున్నామని , ఈ సమస్యను ఐ ఎన్ టి యు సి సెక్రటరీ జనరల్ జనక ప్రసాద్ దృష్టికి తీసుకెళ్తామని రజాక్ తెలిపారు. జీఎం శాలెం రాజు సానుకూలంగా స్పందిస్తూ అన్ని పనులను త్వరగా అయ్యే విధంగా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు ముక్కపాటి వెంకటేశ్వరరావు, శివకేశవులు, పీఏ మూర్తి, ఐ ఎన్ టి యుసి నాయకులు ఎస్.కె గౌస్ ,భూటిక రాజేశ్వరరావు, రావి నాగేశ్వరావు, జిదుల రాజేశ్వరరావు, సకినాల సమ్మయ్య, పోచం శ్రీనివాస్ ,మల్లారం కొమరయ్య, రామారావు,చెన్న కేశవరావు, నాగార్జున,విప్లవ రెడ్డి, కాసర్ల సమ్మయ్య, చిలుక రాజయ్య, సిహెచ్ కుమార్ స్వామి, సత్తార్ భాష, సాగర్, కలవల శ్రీనివాస్, మురళి, సీతారామరాజు, కుమార్, రహీం, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# 25వ.డివిజన్.చంద్రబాబు కాలనీలో వెలుగు సామాజిక సమస్త డాక్టర్ సురభి శ్రీధర్ ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు అక్షరాభ్యాసం




రామగుండం,03 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని, 25వ డివిజన్ చంద్రబాబు కాలనీలో ని, అంగన్వాడి కేంద్రంలో సోమవారం వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ లయన్ డాక్టర్ సురభి శ్రీధర్ ఆధ్వర్యంలో పిల్లలకు అక్షర అభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంస్థ గౌరవ అధ్యక్షులు పెద్దంపేట్ శంకర్ గౌడ్, సంస్థ ప్రధాన కార్యదర్శి లయన్ డాక్టర్ చింతలపల్లి కిషన్ రావు, ఏఎస్ఐ డాక్టర్ బాయ్ శ్రీనివాస్ హాజరై పిల్లలకు అక్షర అభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అతిథులు మాట్లాడారు. అంగన్వాడి కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న టీచర్లు, ఆయలు అందిస్తున్న సేవలు వెలకట్టలేమని అన్నారు.అంగన్వాడీ కేంద్రంలో రెండు సంవత్సరాలు దాటిన పిల్లలను చేర్పించినట్లు అయితే పిల్లలను అన్ని రకాల ఎదుగుదల ఉంటుందన్నారు. ఇంగ్లీషు బోధన ఎల్కేజీ యూకేజీ విద్యను , మూడు సంవత్సరాల పిల్లలకు ఎల్కేజీ నాలుగు సంవత్సరాల పిల్లలకు యూకేజీ విద్యను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్వాడీ కేంద్రాలలో అందిస్తారని మరియు ఒక పూట సంపూర్ణ భోజనం తో పాటు పిల్లలకు సాయంత్రం 4 గంటల వరకు అంగన్వాడీ కేంద్రాలలో విద్యను అందిస్తాయి అని తెలిపారు అందరూ తమ తమ చిన్న పిల్లలను అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలని వారు కోరారు...ఈ కార్యక్రమంలో అల్లురి సెక్టార్ సూపర్వైజర్ మమత, అంగన్వాడి టీచర్ బి. భాగ్యలక్ష్మి ,ఆయా ఎల్.ఆర్ ఈశ్వరి తోపాటు పిల్లల, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్ నియోజకవర్గానికి 4.50 కోట్ల ఎంపీ నిధులతో అభివృద్ధి పనులు

**మేకవనంపల్లి లో నూతన సీసీ రోడ్ల పనులు ప్రారంభం, జిల్లా దిశా కమిటీ మెంబర్ వడ్ల నందు.**



వికారాబాద్,03 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): భారత ప్రభుత్వ విప్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సహకారంతో కేంద్రం నిధుల నుంచి మొట్టమొదటిసారిగా వికారాబాద్ జిల్లాలోని మోమిన్ పెట్ మండలంలోని మేకవనం పల్లి గ్రామ సిసి రోడ్ నిర్మాణ పనులు చేపట్టడం జరిగింది. వికారాబాద్ నియోజకవర్గ బిజెపి పార్టీ కోఆర్డినేటర్, జిల్లా దిశా కమిటీ సభ్యులు "వడ్ల నందు", డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి, మండల బిజెపి అధ్యక్షులు ఆశీరెడ్డి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జేకేయంఆర్ ఫౌండర్ రాములు, మోమిన్ పెట్ మండల్ మాజీ అధ్యక్షుడు భుజంగరెడ్డి, మోమిన్ పెట్ మండల్ మాజీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మోమిన్ పెట్ మండల కిషన్ మోర్చా అధ్యక్షులు రాజిరెడ్డి, జే.సంగారెడ్డి, విట్టల స్వామి, జిల్లా కార్యదర్శి మల్లేష్ యాదవ్, మర్పల్లి మండల ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల లక్ష్మయ్య, శ్రీశైలం గౌడ్, బిజెపి ధార్మిక్ సెల్ కన్వీనర్ మోహన్ రెడ్డి, ప్యాట శంకర్, జి యాదగిరి, రాములు, పి.నితీష్ రెడ్డి, కే.సంతోష్ రెడ్డి, కే. శ్రీనివాస్,జె.వెంకట్ గౌడ్,వి.సంతోష్ కుమార్, కోట్పల్లి శ్రీనివాస్, టి. సుభాష్ గౌడ్,జై.కిరణ్ కుమార్, జి మహేష్, న్.రాజేష్, జె కిరణ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ పై జాతీయ వర్క్ షాప్

**- ఆసక్తిగల ఈనెల 11వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవచ్చు.. బివక్తలుగా ప్రముఖ అధ్యాపకులు.**

పటాన్ చెరు,03 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎం)లు, జనరేటివ్ ఏఐ' అనే అంశంపై ఈనెల 13-14 తేదీలలో జాతీయ వర్క్ షాప్పు నిర్వహించనున్నారు.ఇందులో పాల్గొనే వారికి ఆ రెండు అంశాలపై పరివర్తనాత్మక ప్రపంచంలో బలమైన పునాదిని అందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.వాస్తవ ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి ఎల్ఎల్ఎంలు, జనరేటివ్ ఏఐ పద్ధతులను అమలు చేయడంలో వారి నైపుణ్యాలను పెంపొందించడానికి ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసినట్టు కార్యశాల నిర్వాహకులు డాక్టర్ మోతాహార్ రెజా, డాక్టర్ బీ. ఎం. నాయుడు తెలియజేశారు. ఎల్ఎల్ఎం, జనరేటివ్ ఏఐల పరిచయం.ఏఐలో నీతి,సవాళ్లు, రియల్-వరల్డ్ అప్లికేషన్లు, కేస్ స్టడీస్ వంటి అనేక కీలకమైన అంశాలను ఈ రెండు రోజుల కార్యక్రమంలో విశదీకరిస్తామన్నారు.ఇందులో పాల్గొనే వారు వివిధ డొమైన్ లలో ట్రాన్స్ ఫార్మర్ ఆర్కిటెక్చర్ లు, జనరేటివ్ టెక్ట్స్ మోడళ్లు, మల్టీమోడల్ ఏఐ అప్లికేషన్ లతో సహా ఏఐలో అత్యాధునిక పురోగతులను అన్వేషించే అవకాశాన్ని కూడా పొందుతారని తెలిపారు.ప్రతిష్టాత్మక సంస్థలకు చెందిన గౌరవనీయమైన రీసోర్స్ పర్సన్ లు ఆయా సెషన్ లకు నాయకత్వం వహిస్తారని, వారిలో హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సిబా ఉదగత, కోల్ కతా ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్ స్టిట్యూట్ ప్రొఫెసర్ అన్సుమన్ బెనర్జీ, ఐఐటీ ఖరగ్ పూర్ ప్రొఫెసర్ అనిమేష్ ముఖర్జీ, ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ మానేంద్ర శంకర్ దేశర్కర్, బెంగళూరులోని శామ్ సంగ్ లిమిటెడ్ సీనియర్ డైరెక్టర్ ప్రవీణ్ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.



ఈ వర్క్ షాపులో విద్యావేత్తలు, పరిశోధక విద్యార్థులు,బీటెక్, ఎంటెక్, ఎమ్మెస్సీ స్థాయి విద్యార్థులు పాల్గొనవచ్చని, వారు ఏఐ. డేటా సైన్స్ రంగాలలో సమగ్ర జ్ఞానం,ఆచరణాత్మక అనుభవం, విలువైన పరిశ్రమ అంతర్దృష్టులు, నెట్ వర్కింగ్ అవకాశాలు, ఈ రంగంలో భవిష్య పురోగతికి సంసిద్ధతను పొందవచ్చన్నారు.


ఆసక్తి గలవారు ఈనెల 11వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని. ఇతరత్రా వివరాల కోసం కార్యక్రమ సమన్వయకర్తలు డాక్టర్ కె. కృష్ణ 99080 85343 లేదా డాక్టర్ డి.మల్లికార్జునరెడ్డి 98493 17334 లను సంప్రదించవచ్చని లేదా kummari@gitam.edu/mdoodipoagitam.edu కు ఈ-మెయిల్ వేయాలని నిర్వాహకులు సూచించారు.

# ఇంటర్ ప్రైవేట్ అధ్యాపకులు.. ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ కు లేఖ...

**ఇంటర్ ప్రాక్టికల్ ఎగ్జామినేషన్ డ్యూటీల కు ప్రవేట్ అధ్యాపకులకు కాకుండా.... ప్రభుత్వ, కాంట్రాక్ట్ అధ్యాపకులకే ప్రాక్టికల్ డ్యూటీలు నిర్వహించడంలో రహస్యం ఏమిటి....**



హనుమకొండ,03 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):డిఐఈఓ, మ సెక్రెటరీ బిఐఈ, ప్రిన్సిపాల్ సెక్రెటరీ, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ కి లేఖ ప్రైవేటు అధ్యాపకుల సర్వీస్ ఆధారంగా ప్రాక్టికల్ మరియు ఇంటర్ ఎగ్జామ్ డ్యూటీస్ ని కేటాయించడంలో భేదాలు... ప్రవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్నటువంటి ప్రతి అధ్యాపకునికి ప్రాక్టికల్ మరియు ఇంటర్ ఎగ్జామినేషన్ డ్యూటీలలో ప్రభుత్వ ,కాంట్రాక్ట్ అధ్యాపకులకు సమానంగా డ్యూటీలు కేటాయించాలని.. ప్రవేట్ కాలేజీలలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగస్తులకి ఇంటర్ బోర్డు ద్వారా ఐడెంటి కార్డు అందజేయాలి మరియు వారి సర్వీసుని పరిగణలోకి తీసుకోవాలి.. గత సంవత్సరం పేపర్ వాల్యుయేషన్ చేసిన రెమ్యూనరేషన్ ఇంకా కొంతమందికి రాలేదు కావున అది వెంటనే చెల్లించాలి ఇంటర్ ఎగ్జామినేషన్ డ్యూటీస్ లో ప్రభుత్వ, కాంట్రాక్ట్ అధ్యాపకులకు సమానంగా సీఈ లు, ఏఈ లు వారి సర్వీస్ ఆధారంగా కేటాయించాలి ప్రతి అధ్యాపకునికి 10 లక్షల వరకు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి... ఈ సమస్యలను వెంటనే నెరవేర్చినట్లు.. మార్చిలో నిర్వహించబోయే ఇంటర్ పేపర్ వాల్యుయేషన్ క్యాంపును ప్రైవేట్ అధ్యాపకులు బహిష్కరించవలసి వస్తుందని హెచ్చరిక చేయడం జరుగుతుంది... రీగ్రాండ్ టి జి పి ఎల్ ఎ స్టేట్ కమిటీ తెలంగాణ ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పేట శ్రీనివాసులు, సిరంగి సుమన్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ మనోరంజన్ రెడ్డి, హనుమకొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుర రాజేందర్, ముత్యాల యుగంధర్, బొజ్జం శ్రీనివాస్ నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మదనపల్లి రాజేందర్, యం బుచ్చిరెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు...


Regd. No. 12/2001
తెలంగాణ ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్
TGPLA
#16-11-22/A, Flat NO. 518, Gyandeep Towers, Moosaram Bagh, Hyderabad - Cell : 9849335374
# 2-6-1311, Bhavani Nagar, Hanamkonda, Dist : Warangal (U), Telangana - 506 001.

పులి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షులు, సెల్ : 9849335374
బి. రాజేశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్, సెల్ : 9848684004
బి. మాధవ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సెల్ : 9966059805

Ref. తేది :

REGARDS
TGPLA STATE COMMITTEE




# దుద్యాల మండలం,హకీంపేట్ గ్రామ రైతులకు ఇంటి స్థలాల పంపిణి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.



వికారాబాద్,03 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):పారిశ్రామిక పార్క్ కు భూములను ఇచ్చేందుకు సమ్మతి ఇచ్చిన రైతులకు నష్ట పరిహారం తో పాటు అప్రూవ్ లేఅవుట్ ప్రకారం ఇంటి స్థలాలను ఇవ్వడం జరుగుతుంది,జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో పారిశ్రామిక పార్క్ కోసం అసైన్డ్ భూములకు సంబంధించి దుద్యాల్ మండలం హకీంపేట్ గ్రామ రైతులతో కలెక్టర్ ప్రతీక్ జైన్ చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ,ఫారమ్-సి నోటిఫికేషన్ జారీచేసిన 60 రోజలకు సమ్మతి అవార్డు కోసం జారీ చేయబడిందన్నారు. పేర్కొన్న వ్యవధిలో భూసేకరణలో ఏవైనా అభ్యంతరాలు తదితర అంశాలపై జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ సమావేశంలో కూలంకుశంగా చర్చించడం జరిగిందని,218 మంది రైతులకు సంబంధించి హకీం పేట గ్రామంలో మొత్తం 351 ఎకరాల భూమి ఉందని దీనిపై రైతులతో చర్చ నిర్వహించి రైతుల సమ్మతాన్ని పొందినట్లు కలెక్టర్ తెలిపారు. సమ్మతి అవార్డు పొందిన రైతులకు ఒకే దఫాలో చెక్కుల ద్వారా నష్ట పరిహారాన్ని చెల్లించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రైతులు ఎలాంటి అపోహలకు తావునివ్వకూడదని ఆయన అన్నారు.ఎకరానికి 20 లక్షలు,150 గజాల ఇంటి స్థలములో ఇందిరమ్మ ఇల్లు, అర్హతల మేరకు ఇంటికి ఒక ఉద్యోగం కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ లింగ్యా నాయక్ , తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ట్రైనీ ఉమా హారతి , టిజిఐఐసి జోనల్ మేనేజర్ ఓ.వి.టీ. శారద, అసిస్టెంట్ జోనల్ మేనేజర్ అజీమ సుల్తానా, దుద్యాల తహసిల్దార్ కిషన్, హకీంపేట రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఆరోగ్య క్రాంతి

మంగళవారం 04 ఫిబ్రవరి 2025

epaper.krtvnews.com




## ఇలా చేసి ఎముకలను బలంగా చేసుకోండి



హెల్త్ న్యూస్,03 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):ఎముకల ఆరోగ్యం మన మొత్తం శరీర ఆరోగ్యంలో ఓ కీలకమైన అంశం. ఎందుకంటే, ఎముకలు మన శరీరాలకు నిర్మాణాత్మక మద్దతును అందిస్తాయి. ముఖ్యంగా మన అంతర్గత అవయవాలను రక్షిస్తాయి. బోలు ఎముకల వ్యాధిని నివారించడానికి, ఎముక పగుళ్లు, ఇతర ఎముక సంబంధిత గాయాల ప్రమాదాన్ని తగ్గించడానికి బలమైన ఎముకలను నిర్వహించడం చాలా అవసరం. మానవ శరీరంలో సరైన ఎముక ఆరోగ్యాన్ని నిర్మించడానికి అలాగే దానిని నిర్వహించడానికి కొన్ని ప్రభావవంతమైన మార్గాలను చూద్దాం.

**తగినంత కాల్షియం, విటమిన్ డి పొందండి:**
కాల్షియం ఒక ముఖ్యమైన ఖనిజం. ఇది బలమైన ఎముకలను నిర్మించడానికి అవసరం. పాల ఉత్పత్తులు, ఆకుకూరలు, బలవర్ధకమైన ఆహారాలు వంటి కాల్షియం అధికంగా ఉండే ఆహారాలను మీ ఆహారంలో చేర్చడం చాలా ముఖ్యం. కాల్షియం శోషణకు విటమిన్ డి కూడా కీలకం. కాబట్టి సూర్యరశ్మి పుష్కలంగా ఉండేలా చూసుకోండి. లేకపోతే ఎముక ఆరోగ్యానికి తోడ్పడటానికి విటమిన్ డి సప్లిమెంట్ తీసుకోండి.

**బరువు మోసే వ్యాయామంలో పాల్గొనండి:**
వాకింగ్, రన్నింగ్, వెయిట్ లిఫ్టింగ్ వంటి రెగ్యులర్ వెయిట్ బేరింగ్ వ్యాయామాలు ఎముకలను బలోపేతం చేయడానికి, ఇంకా ఎముక సాంద్రతను పెంచడానికి సహాయపడతాయి. ఈ కార్యకలాపాలు కొత్త ఎముక కణజాలాన్ని నిర్మించడానికి, మొత్తం ఎముక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ప్రేరేపిస్తాయి.

**ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగించండి:**
వీలైతే.. ధూమపానం మానుకోండి.. కుదరకపోతే మద్యపానాన్ని పరిమితం చేయండి. ఎందుకంటే ఈ అలవాట్లు ఎముకలను బలహీనపరుస్తాయి. ఇంకా ఇవి ఎముక పగుళ్ల ప్రమాదాన్ని పెంచుతాయి. పండ్లు, కూరగాయలు, లీన్ ప్రోటీన్లు, తృణధాన్యాలు అధికంగా ఉండే సమతుల్య ఆహారం తీసుకోవడం కూడా ఎముకల ఆరోగ్యానికి ఇంకా మొత్తం శ్రేయస్సుకు సహాయపడుతుంది.

**ఎముక సాంద్రతను పర్యవేక్షించండి:**
మీ ఎముక సాంద్రతను పర్యవేక్షించడానికి లేదా బోలు ఎముకల వ్యాధి ప్రమాదాన్ని అంచనా వేయడానికి మీ ఆరోగ్య సంరక్షణ ప్రదాతతో క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం చాలా అవసరం. అవసరమైతే, మీ వైద్యుడు బలమైన ఎముకలను నిర్వహించడానికి ఎముక సాంద్రత పరీక్షలు లేదా ఇతర నివారణ చర్యలను సిఫారసు చేయవచ్చు.

**సమతుల్య వ్యాయామాలు సాధన చేయండి:**
యోగా, పైలేట్స్ వంటి సమతుల్య వ్యాయామాలను మీ ఫిట్నెస్ దినచర్యలో చేర్చడం సమన్వయాన్ని మెరుగుపరచడానికి, పగుళ్లు, ఇంకా ఇతర ఎముక గాయాలకు దారితీసే వాటిని నిరోధించడానికి సహాయపడుతుంది. చురుకైన, క్రమం తప్పకుండా శారీరక శ్రమలో పాల్గొనడం అనేది బలమైన, ఆరోగ్యకరమైన ఎముకలను నిర్వహించడానికి కీలకం.

## జంక్ ఫుడ్‌కు బదులుగా.. పొద్దు తిరుగుడు విత్తనాలను తింటే ఎన్నో లాభాలు



హెల్త్ న్యూస్,03 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): నిత్యం ఉరుకుల పరుగుల బిజీ యుగం కావడంతో చాలా మంది ఆరోగ్యకరమైన ఆహారాలను తినడం లేదు. ఎంత సేపు బయట లభించే జంక్ ఫుడ్‌ను లేదా ఇతర తినుబండారాలను తినేందుకే ఆసక్తిని చూపిస్తున్నారు. కానీ ఇవి మన ఆరోగ్యానికి చేటు చేస్తాయి. వీటిని తింటే అప్పటికప్పుడు ఏమీ కాకపోయినా దీర్ఘకాలంలో మాత్రం అనేక అనారోగ్య సమస్యలను తెచ్చి పెడతాయి. కనుక ఆరోగ్యవంతమైన ఆహారాలను తినాల్సి ఉంటుంది. మీకు ఆకలిగా అనిపించినప్పుడు జంక్ ఫుడ్‌ను తినే బదులు విత్తనాలను తినవచ్చు. మరీ ముఖ్యంగా పొద్దు తిరుగుడు విత్తనాలను తినడం వల్ల ఎన్నో లాభాలను పొందవచ్చు. వీటిని తింటే ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో జంక్ ఫుడ్ జోలికి పోకుండా ఉంటారు. పొద్దు తిరుగుడు విత్తనాలను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలు ఉంటాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

**పోషకాలకు నెలవు..**

పొద్దు తిరుగుడు విత్తనాలను తినడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. మెదడు ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తాయి. రోజూ గుప్పెడు మోతాదులో ఈ విత్తనాలను తినాలి. 1 టీస్పూన్ మోతాదులో ఈ విత్తనాలను తింటేనే మనకు 25 క్యాలరీల శక్తి లభిస్తుంది. 1 గ్రాము ప్రోటీన్లు, 1 గ్రాము కార్బొహైడ్రేట్లు, 0.5 గ్రాముల ఫైబర్, 2 గ్రాముల కొవ్వులు, 1.2 మిల్లీగ్రాముల విటమిన్ ఇ, 4 మిల్లీగ్రాముల మెగ్నిషియం, 0.2 మిల్లీగ్రాముల జింక్, 2 మైక్రోగ్రాముల సెలీనియం, 0.2 మిల్లీగ్రాముల ఐరన్ లభిస్తాయి. పొద్దు తిరుగుడు విత్తనాలను తినడం వల్ల విటమిన్ ఇ, మెగ్నిషియం, సెలీనియం, ఆరోగ్యకరమైన కొవ్వులు తదితర పోషకాలను సమృద్ధిగా పొందవచ్చు. ఇవన్నీ మనల్ని అన్ని రకాలుగా ఆరోగ్యంగా ఉంచుతాయి. రోగాల నుంచి రక్షిస్తాయి.

**కొలెస్ట్రాల్ తగ్గుతుంది..**

పొద్దు తిరుగుడు విత్తనాలలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు, యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని ఎల్‌డీఎల్ (చెడు కొలెస్ట్రాల్)ను తగ్గిస్తాయి. హెచ్‌డీఎల్ (మంచి కొలెస్ట్రాల్)ను పెంచుతాయి. దీంతో రక్తనాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు. పొద్దు తిరుగుడు విత్తనాల్లో ఉండే విటమిన్ బి6, మెగ్నిషియం జ్ఞాపకశక్తిని పెంచుతాయి. ఏకాగ్రతను కలిగిస్తాయి. దీంతో ఏ విషయంపై అయినా సరిగ్గా దృష్టి పెట్టగలుగుతారు. అలాగే ఒత్తిడి, ఆందోళన నుంచి విముక్తి లభిస్తుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. మైండ్ రిలాక్స్ అయి రాత్రి పూట నిద్ర చక్కగా పడుతుంది. పడుకున్న వెంటనే నిద్రలోకి జారుకుంటారు.

**రోగ నిరోధక వ్యవస్థ, జీర్ణ వ్యవస్థలకు..**

మలబద్దకం సమస్యతో బాధపడుతున్న వారికి పొద్దు తిరుగుడు విత్తనాలు చక్కని ఉపశమనాన్ని అందిస్తాయి. ఈ విత్తనాలను రోజూ తింటుంటే జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. దీంతో విరేచనం సాఫీగా అవుతుంది. మలబద్దకం తగ్గుతుంది. ఈ విత్తనాల్లో జింక్, సెలీనియం అధికంగా ఉంటాయి. ఇవి ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతాయి. శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. పొద్దు తిరుగుడు విత్తనాల్లో విటమిన్ ఇ అధికంగా ఉంటుంది. ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవి చర్మాన్ని మెరిసేలా చేస్తాయి. జుట్టును దృఢంగా, ఆరోగ్యంగా ఉంచుతాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో కణాలు డ్యామేజ్ అవకుంటా ఉంటాయి. ఇది చర్మాన్ని సంరక్షిస్తుంది. చర్మం యవ్వనంగా ఉండేలా చూస్తుంది. ఇలా పొద్దు తిరుగుడు విత్తనాలను రోజూ తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

## యంగ్‌గా కనిపించాలంటే ఈ డైట్‌ను ఫాలో అయిపోండి..!



హెల్త్ న్యూస్,03 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): సినిమా తారలను చూస్తే ఎల్లప్పుడూ వారు యంగ్‌గానే కనిపిస్తారు. 50 సంవత్సరాల వయస్సులోనూ యవ్వనంగానే కనిపిస్తారు. అయితే వారు అలా కనిపించేందుకు ఎంతో కష్టపడతారన్న విషయం మాత్రం చాలా మందికి తెలియదు. వారు సినిమాల్లో నటించాలి కనుక యంగ్‌గా ఉంటేనే బాగుంటుంది. కనుక ఆ ఫిజిక్‌ను మెయింటెయిన్ చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తుంటారు. వ్యాయామం చేయడంతోపాటు స్ట్రిక్ట్ డైట్‌ను కూడా పాటిస్తుంటారు. అయితే మన శరీరాన్ని యవ్వనంగా ఉంచడంలో ఆహారం ముఖ్య పాత్ర పోషిస్తుందని చెప్పవచ్చు. మనం తీసుకునే ఆహారాలే మన శరీనాన్ని యవ్వనంగా ఉంచుతాయి. అనారోగ్యాల బారిన పడకుండా చూస్తాయి. ఈ క్రమంలోనే నిత్యం పలు ఆహారాలను తినడం వల్ల ఎల్లప్పుడూ యంగ్‌గా ఉండేలా చూసుకోవచ్చు. దీంతో అందరి దృష్టి మీపైనే పడుతుంది. ఇక అందుకు ఏయే ఆహారాలను తినాలో ఇప్పుడు తెలుసుకుందాం.

**గ్రీన్ టీ :** రోజూ 2 నుంచి 3 కప్పుల గ్రీన్ టీని సేవిస్తుండడం వల్ల ఎల్లప్పుడూ చర్మాన్ని యవ్వనంగా ఉంచుకోవచ్చు. గ్రీన్ టీలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా ఇందులో పాలిఫినాల్స్ ఉంటాయి. ఇవి వృద్ధాప్య ఛాయలను తగ్గిస్తాయి. ముఖంపై ఉండే ముడతలు, మచ్చలు పోయేలా చేస్తాయి. దీంతోపాటు తీవ్రమైన వ్యాధులు రాకుండా చూస్తాయి. కనుక గ్రీన్ టీని రోజూ తాగుతుంటే ఆరోగ్య ప్రయోజనాలు కలగడమే కాకుండా శరీరాన్ని ఎల్లప్పుడూ యవ్వనంగా ఉంచుకోవచ్చు. చర్మం కాంతివంతంగా మారి మెరుస్తుంది. అలాగే వారంలో కనీసం 2 నుంచి 3 సార్లు చేపలను ఆహారంలో భాగం చేసుకోవాలి. సాల్మన్ వంటి చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, ప్రోటీన్లు, సెలీనియం, ఆస్టాజాంతిన్ వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి మన శరీరంలో కొల్లాజెన్‌ను ఉత్పత్తి చేసేందుకు దోహదపడతాయి. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. కనుక చేపలను తరచూ తింటుండాలి.

**డార్క్ చాకొలెట్లు :**డార్క్ చాకొలెట్లను తినడం వల్ల కూడా చర్మం ఎల్లప్పుడూ యవ్వనంగా ఉంటుంది. వీటిల్లో ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవి సూర్యుని నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల బారి నుంచి చర్మాన్ని సంరక్షిస్తాయి. దీంతో చర్మం యవ్వనంగా కనిపిస్తుంది. వృద్ధాప్య ఛాయలు అంత త్వరగా రావు. అవిసె గింజలలో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా ఈ గింజల్లో ఆల్ఫా-లినోలీనిక్ యాసిడ్ ఉంటుంది. ఇది చర్మం పొరలను సంరక్షిస్తుంది. చర్మం ఎల్లప్పుడూ తేమగా ఉండేలా చేస్తుంది. దీంతో చర్మానికి సహజసిద్ధమైన నిగారింపు వస్తుంది. కనుక అవిసె గింజలను కూడా రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలి.

**దానిమ్మ పండ్లు :**చూసేందుకు ఎరుపు రంగులో దానిమ్మ పండ్లు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఇవంటే చాలా మందికి ఇష్టమే. అయితే దానిమ్మ పండును రోజూ ఒకటి తింటున్నా చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. దానిమ్మ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి చర్మానికి మరమ్మత్తులు చేస్తాయి. దీంతో చర్మ కణాలు పునరుత్తేజం చెందుతాయి. చర్మం యవ్వనంగా మారి కాంతివంతంగా కనిపిస్తుంది. రోజూ దానిమ్మ పండును తినడం ఇష్టం లేకపోతే దాని జ్యూస్‌ను అయినా తాగవచ్చు. దీంతో చర్మాన్ని యంగ్‌గా ఉంచుకోవచ్చు. అలాగే చెర్రీలను ఆహారంలో భాగం చేసుకున్నా కూడా చర్మం ఆరోగ్యంగా, సురక్షితంగా ఉంటుంది. చెర్రీ పండ్లలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి కొల్లాజెన్ ఉత్పత్తికి దోహదం చేస్తాయి. దీంతో చర్మం సురక్షితంగా ఉంటుంది. యవ్వనంగా కనిపిస్తుంది. ఇలా పలు రకాల ఆహారాలను తింటే చర్మాన్ని ఎల్లప్పుడూ యంగ్‌గా కనిపించేలా చేయవచ్చు.

మన క్రాంతి
KR TV
మంగళవారం 04 ఫిబ్రవరి 2025

# క్రీడలు

epaper.krtvnews.com

## అతడి కోసమే ఈ ఊచకోత - అభిషేక్




స్పోర్ట్స్ న్యూస్,03 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):ఇంగ్లండ్‌తో ఆఖరి టీ20లో విధ్వంసక బ్యాటింగ్‌తో చెలరేగాడు టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ. జోఫ్రా ఆర్చర్ మొదలుకొని ఆదిల్ రషీద్ వరకు ఎవ్వర్నీ వదలకుండా పిచ్చకొట్టుడు కొట్టాడు. సంచలన బ్యాటింగ్‌తో ఇంగ్లండ్‌ను షేక్ చేశాడు టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ. బౌండరీలు, సిక్సులతో హోరెత్తించాడు. ఉరుములు, మెరుపులతో స్టేడియం దద్దరిల్లేలా చేశాడు. బట్లర్ సేన మీద తుఫానులా విరుచుకు పడ్డాడు. 7 బౌండరీలు, 13 సిక్సులతో ఆ టీమ్ బెండు తీశాడు. జోఫ్రా ఆర్చర్ దగ్గర నుంచి మార్క్ వుడ్, ఆదిల్ రషీద్ వరకు ఎదురొచ్చిన ప్రతి బౌలర్‌ను ఉతికిఆరేశాడు. బంతి వేయాలంటే భయపడేలా వణికించాడు. 54 బంతుల్లో 135 పరుగుల విధ్వంసక ఇన్నింగ్స్‌తో ఆఖరి మ్యాచ్‌ను వన్‌సైడ్ చేసేశాడు. అతడి కారణంగా ఏకంగా 150 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది భారత్. ఈ మ్యాచ్ తర్వాత అభిషేక్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

**ఆయనొక్కడే నమ్మాడు!**

వాంఖడే ఇన్నింగ్స్‌ను తన గురువు యువరాజ్ సింగ్‌కు అంకితం చేశాడు అభిషేక్. ఈ ఊచకోత నాక్ అతడి కోసమే అన్నాడు. ఈ ఇన్నింగ్స్‌తో అతడు సంతోషిస్తాడని భావిస్తున్నట్లు తెలిపాడు. 15 నుంచి 16వ ఓవర్ దాకా తాను బ్యాటింగ్ చేయాలని, అప్పటివరకు క్రీజులో ఉండాలని యువీ చెబుతూ ఉండేవాడని అభిషేక్ గుర్తుచేసుకున్నాడు. తనను నమ్మిన ఏకైక వ్యక్తి యువీ పాజీ అంటూ ఎమోషనల్ అయ్యాడు. నువ్వు ఇండియాకు తప్పకుండా ఆడతావ్.. టీమ్‌ను గెలిపిస్తావ్ కూడా అంటూ తనలో ఆయన విశ్వాసం నింపాడని అభిషేక్ చెప్పుకొచ్చాడు.

**వాళ్ల కోసమే సెలబ్రేషన్..**

'యువరాజ్ సింగ్ నన్ను ఎంతో నమ్మారు. నువ్వు తప్పకుండా భారత్‌కు ఆడతావంటూ నాలో కాన్ఫిడెన్స్ నింపారు. నా కెరీర్‌లో ఆయనది కీలకమైన పాత్ర అని చెప్పాలి. ఆయన వల్లే నేను ఇక్కడి వరకు రాగలిగాను. ఆయన నన్ను చాలా బాగా చూసుకుంటారు. ప్రతి మ్యాచ్ తర్వాత యువీ పాజీతో మాట్లాడతా. ఆయన చెప్పిన విషయాన్ని తూచా తప్పకుండా పాటిస్తా. నా ఆట గురించి నా కంటే ఆయనకే బాగా తెలుసు' అని అభిషేక్ చెప్పుకొచ్చాడు. ఈ ఇన్నింగ్స్‌పై సంతృప్తిగా ఉన్నానని అన్నాడు. సెంచరీ తర్వాత ఫ్యామిలీ కోసమే వాళ్ల వైపు చూస్తూ సెలబ్రేట్ చేసుకున్నానని పేర్కొన్నాడు

## గుకేష్‌ను ఓడించిన ప్రజ్ఞానంద..

### టాటా స్టీల్ మాస్టర్స్ 2025 టైటిల్ కైవసం

స్పోర్ట్స్ న్యూస్,03 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానందా చరిత్ర సృష్టించాడు. ప్రపంచ ఛాంపియన్ డి గుకేష్‌ను ఓడించి టాటా స్టీల్ మాస్టర్స్ 2025 చెస్ ఈవెంట్‌ను గెలుచుకున్నాడు. నెదర్లాండ్స్‌లోని విజ్క్ ఆన్ జీలో జరిగిన ఫైనల్లో ఇది చోటుచేసుకుంది. ప్రపంచ ఛాంపియన్ డి గుకేష్‌ను గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద ఓడించి సరికొత్త రికార్డ్ సృష్టించాడు. ఈ క్రమంలో గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద టాటా స్టీల్ మాస్టర్స్ 2025 టైటిల్ గెల్చుకున్నాడు. టై-బ్రేకర్‌లో ప్రపంచ ఛాంపియన్ డి గుకేష్‌ను ప్రజ్ఞానంద 2-1 తేడాతో ఓడించాడు. ఈ క్రమంలో 2006లో విశ్వనాథన్ ఆనంద్ తర్వాత టాటాలో అత్యున్నత బహుమతిని గెలుచుకున్న మొదటి భారతీయుడిగా ప్రజ్ఞానంద అరుదైన ఘనతను దక్కించుకున్నాడు.




**ఉత్కంఠభరితంగా కొనసాగిన ఆట..**

నిజానికి, ఆర్ ప్రజ్ఞానంద, డి గుకేష్ మధ్య ఆట ఉత్కంఠభరితంగా కొనసాగింది. ఆ క్రమంలో 13వ, చివరి రౌండ్ పూర్తి చేసిన తర్వాత ఇద్దరూ కూడా 8.5 పాయింట్లతో ఆటను డ్రాగా ముగించారు. ఈ క్రమంలోనే ఇద్దరు యువ ఆటగాళ్ళు టై-బ్రేకర్ మ్యాచ్ ఆడటం ద్వారా విన్నర్ ఎవరో తేలిపోయింది. ఆదివారం రెండు గేమ్‌ల బ్లిట్జ్ టైబ్రేకర్‌లో గుకేష్ మొదటి గేమ్‌ను గెలుచుకున్నాడు. కిరీటాన్ని కైవసం చేసుకోవడానికి గుకేష్‌కు రెండో బ్లిట్జ్ టైబ్రేకర్‌లో ఒక డ్రా మాత్రమే అవసరం. అయితే ప్రజ్ఞానంద రెండు బ్లిట్జ్ గేమ్‌లను గెలిచి మళ్లీ తిరిగి వచ్చాడని చెప్పవచ్చు. ఈ క్రమంలో ప్రపంచ ఛాంపియన్‌ను ఓడించి కీలక టైటిల్‌ను గెలుచుకున్నాడు.

**నియంత్రణ కోల్పోయి..**

ప్రారంభ గేమ్‌లో ప్రజ్ఞానందా ఒక తప్పు చేసి, బెనోనిని రివర్స్ కలర్స్‌లో ఎదుర్కొన్నాడు. అందువల్ల ఆయన ఆ గేమ్‌ను కోల్పోయాడు. కానీ ఆ తర్వాత అతను రెండో గేమ్‌లో ట్రోంపోవ్‌స్కీ ఓపెనింగ్ ఉపయోగించి, చిట్టా గేమ్ ఆడతూ, గుకేష్ చేసిన ఒక తప్పిదాన్ని సద్వినియోగం చేసుకుని స్కోరు 1-1గా సమం చేసుకున్నాడు. ఆ తర్వాత టైబ్రేకర్ ఆట సడన్ డెత్ ఫార్మాట్‌లోకి వెళ్లింది. ఇందులో తెల్లటి పావుల ఆటగాడికి 2 నిమిషాల 30 సెకన్లు, నల్లటి పావుల ఆటగాడికి 3 నిమిషాలు సమయం ఇచ్చారు. ఈ ఉత్కంఠభరితమైన పోరాటంలో గుకేష్ తన నియంత్రణను కోల్పోయాడు. అదే సమయంలో ప్రజ్ఞానంద తన మంచి టెక్నిక్‌తో గెలిచి తన కెరీర్‌లో తొలిసారి మాస్టర్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు.

## ఖద్దరు బట్టల్లోకి ధోని? క్లారిటీ ఇచ్చేసిన బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్

స్పోర్ట్స్ న్యూస్,03 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):ధోనీ రాజకీయాల్లోకి వస్తాడా? అనే ప్రశ్న క్రికెట్ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా మహీకి మంచి భవిష్యత్ ఉందని వ్యాఖ్యానించారు. అయితే ధోనీ ఇప్పటివరకు రాజకీయాలపై ఆసక్తి చూపలేదు. భవిష్యత్తులో మహీ నాయకుడిగా మారతాడా? అనే అంశం మరింత ఉత్కంఠను పెంచుతోంది.

టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన నాలుగేళ్లయినప్పటికీ, అతడి క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. ఇప్పటికీ ధోనీ పేరు క్రికెట్ అభిమానుల్లో మార్మోగిపోతూనే ఉంది. క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్న పలువురు ఆటగాళ్లు రాజకీయాల్లోకి ప్రవేశించిన నేపథ్యంలో ధోనీ కూడా ఆ దిశగా అడుగులేస్తాడా? అనే ప్రశ్న ఎప్పటి నుంచో చర్చనీయాంశంగా మారింది. గౌతమ్ గంభీర్, మనోజ్ తివారీ, మహ్మద్ కైఫ్, అజారుద్దీన్, అంబటి రాయుడు వంటి పలువురు క్రికెటర్లు రాజకీయాల్లోకి వచ్చి రాణించారు. అయితే ధోనీ మాత్రం ఇప్పటివరకు అటువంటి ఆసక్తిని ప్రదర్శించలేదు.

ఈ నేపథ్యంలో ధోనీ రాజకీయాల్లోకి వస్తే ఎలా ఉంటుందనే అంశంపై బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా స్పందించారు. మహీకి రాజకీయ నాయకుడిగా మంచి భవిష్యత్ ఉంటుందని, అయితే అది పూర్తిగా అతడి వ్యక్తిగత నిర్ణయమని పేర్కొన్నారు. "ధోనీ రాజకీయాల్లోకి వస్తే సులభంగా గెలుస్తాడు. అతడి ప్రజాదరణ తారా స్థాయిలో ఉంది. ముఖ్యంగా బెంగాల్ రాజకీయాల్లో అతడు గట్టి పోటీదారిగా నిలవగలడు" అని రాజీవ్ శుక్లా అభిప్రాయపడ్డారు.

అయితే, గతంలో ధోనీతో రాజకీయాల గురించి మాట్లాడిన విషయాన్ని కూడా రాజీవ్ శు క్లా గుర్తుచేశారు. "ధోనీ 2019 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తాడని ఓ రూమర్ వినిపించింది. నేను దీని గురించి మహీని అడిగినప్పుడు అతడు ఖండించాడు. అసలు అతడు పబ్లిసిటీకి దూరంగా ఉంటాడు. తాను చేసే పనిపై మాత్రమే శ్రద్ధ వహిస్తాడు. కనీసం అతడి దగ్గర మొబైల్ ఫోన్ కూడా ఉండదు. బీసీసీఐ సెలక్టర్లు కూడా అతడిని సంప్రదించాలంటే కష్టమే" అని శుక్లా వివరించారు.




ధోనీ ప్రస్తుతం రాజకీయాల వైపు మళ్లే అవకాశం తక్కువే అయినప్పటికీ, భవిష్యత్తులో ఏం జరుగుతుందో చెప్పడం కష్టం. తాను మైదానంలో చూపిన సహనం, నాయకత్వ గుణాలు రాజకీయాల్లోనూ అతడిని గొప్పస్థాయికి తీసుకెళ్తాయని అనేక మంది విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ధోనీ రాజకీయాల్లోకి వస్తాడా? లేదా? అనే ప్రశ్నకు మాత్రం ఇప్పటికీ స్పష్టమైన సమాధానం లేదు.

అయితే, ధోనీ రాజకీయాల్లోకి వచ్చినట్లయితే అతడి ప్రయాణం ఎలా ఉండనుంది? అన్నదానిపై విశ్లేషకులు ఆసక్తికరమైన అంచనాలు వేస్తున్నారు. క్రికెట్‌లో తన నిర్ణయాలను ఎంత నిశితంగా తీసుకున్నాడో, రాజకీయాల్లో కూడా అదే విధంగా వ్యూహాలను అమలు చేసే సామర్థ్యం అతడిలో ఉంది. గంభీర్ మాదిరిగా పార్లమెంట్‌లో తన గొంతును వినిపించగలడా? లేక అజారుద్దీన్ మాదిరిగా ఒక ప్రత్యేక రాష్ట్ర రాజకీయాలకు పరిమితమవుతాడా? అనే ప్రశ్నలు అభిమానులను ఆలోచనలో పడేశాయి. ముఖ్యంగా జార?ండ్ రాజకీయాల్లో ధోనీ ప్రవేశిస్తే, అతడు ప్రజల్లో గట్టి పట్టును సంపాదించగలడని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

అయితే ధోనీ ఇప్పటివరకు రాజకీయాల గురించి ఎప్పుడూ ఆసక్తి చూపకపోవడం, మీడియా, ప్రచారాలకు దూరంగా ఉండే స్వభావం కలిగి ఉండటం కారణంగా, అతడి రాజకీయ ప్రవేశం ఎప్పుడైనా సంచలనంగా మారే అవకాశం ఉంది. ప్రస్తుతం అతడు వ్యాపారాల్లో తన దృష్టిని కేంద్రీకరించి, క్రికెట్ (ఐపీఎల్) ను ఎంజాయ్ చేస్తూ, కుటుంబంతో సమయం గడుపుతున్నాడు. రాజకీయాల్లోకి రావాలా? వద్దా? అన్నది పూర్తిగా అతడి నిర్ణయమే అయినా, అతడి అభిమానులు మాత్రం మహీ నాయకుడిగా మారితే చూడాలని ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. భవిష్యత్తులో ధోనీ ఏ నిర్ణయం తీసుకుంటాడో వేచి చూడాలి!

# వెంకీ మామ రికార్డు..
## రూ.300 కోట్ల క్లబ్‌లో సంక్రాంతికి వస్తున్నాం.!




మూవీ న్యూస్,03 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా వచ్చిన రీసెంట్ బ్లాక్ బస్టర్ సంక్రాంతికి వస్తున్నాం . మీనాక్షి చౌదరి , ఐశ్వర్య రాజేష్ హీరోయిన్లుగా నటించిన ఈ సినిమాకు అనిల్ రావిపూడి దర్శకత్వం వహించగా.. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ సినిమాను నిర్మించాడు. జనవరి 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా వచ్చి బ్లాక్ బస్టర్ అందుకోవడమే కాకుండా.. రూ.300 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అంతేగాకుండా తెలుగులో ఈ రికార్డు సాధించిన తొలి చిత్రంగా రికార్డు నమోదు చేసింది. మరోవైపు టాలీవుడ్ నుంచి సీనియర్ నటులలో రూ.300 కోట్ల క్లబ్‌లో ఎంటర్ అయిన నటుడిగా వెంకీ మామ రికార్డు సృష్టించాడు.

# డియర్ నానీ.. వెర్రిగా పోదాం..

మూవీ న్యూస్,03 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన 'దసరా' ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. నాని కెరీర్‌లో తొలి వందకోట్ల సినిమా 'దసరా'. ఇప్పుడు మళ్లీ అదే కాంబినేషన్లో నిర్మాత సుధాకర్ చెరుకూరి 'ది ప్యారడైజ్' సినిమాను నిర్మిస్తున్నారు. దాంతో.. అంచనాలు ఆకాశాన్నంటాయి.



ప్రీప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయి. త్వరలోనే షూటింగ్ మొదలుపెట్టనున్నారు. నాని కూడా ఈ సినిమా కోసం ఇంటెన్స్‌గా జిమ్ చేస్తూ మేకోవర్ అయ్యే పనిలో ఉన్నారు. ఇదిలావుంటే.. ఈ సినిమాకు సంగీత దర్శకుడిగా అనిరుధ్ ఖరారైనట్లు మేకర్స్ ఆదివారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు.

జెర్సీ, గ్యాంగ్‌లీడర్ చిత్రాల తర్వాత నాని, అనిరుధ్ కలిసి పనిచేస్తున్న సినిమా ఇదే కావడం విశేషం. ఈ సందర్భంగా నాని తన ఎక్స్‌లో 'మేం మా హ్యాట్రిక్‌పై ఉన్నాం.. ఇది ఒక అద్భుతం అవుతుంది.. ప్యారడైజ్ ఇప్పుడు నాని, అనిరుధ్, ఓదెల సినిమా.. స్వాగతం డియర్ అనిరుధ్..' అంటూ పోస్ట్ చేయగా, 'ఇది చాలా స్పెషల్ మై డియర్ నాని.. వెర్రిగా పోదాం..' అంటూ అనిరుధ్ రిప్లయ్ ఇచ్చారు. ఉద్వేగపూరితంగా సాగే లార్జర్ దెన్ లైఫ్ స్టోరీతో శ్రీకాంత్ తెరకెక్కించనున్న ఈ సినిమాలో నాని పూర్తి మాస్ అవతారంలో కనిపిస్తారని, నాని కెరీర్‌లోనే ఇది హై బడ్జెట్ సినిమా అని మేకర్స్ చెబుతున్నారు.

# అసలు మీ సమస్య ఏంటి?



మూవీ న్యూస్,03 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డేకు కోపం వచ్చింది. ప్రస్తుతం బాలీవుడ్‌పై దృష్టి సారించిన ఈ అందాల భామ.. షాహిద్ కపూర్‌తో 'దేవా' అనే సినిమాలో నటించింది. ఇటీవలే ఆ సినిమా విడుదలైంది. ఈ సినిమా ప్రమోషన్‌లో విలేకరుల అడిగిన ప్రశ్నలు పూజాను అసహనానికి గురిచేశాయి. 'సల్మాన్, హృతిక్, రణ్‌వీర్, షాహిద్ వంటి స్టార్ హీరోల చిత్రాల్లో నటించడాన్ని మీరు అదృష్టంగా భావిస్తారా? అసలు అందుకు మీరు అర్హులేనా? అని విలేకరులు పూజాను ప్రశ్నించగా.. 'ఎస్.. అర్హురాలినే. ఒకవేళ అదృష్టం వల్లే నాకు అవకాశాలు వచ్చాయని మీరు అనుకుంటే.. నేను ఏమాత్రం బాధ పడను. ఏదైనా అవకాశం వచ్చినప్పుడు దానికి అనుగుణంగా సన్నద్ధమై పూర్తి స్థాయిలో ఆ పాత్రకు న్యాయం చేయాలి. అదే అదృష్టంగా భావిస్తా.' అని సమాధానమిచ్చింది పూజా. మీరు సినిమాలు ఎలా ఎంచుకుంటారు? స్టార్ హీరోల సినిమాలైతేనే చేస్తారా? అని మరో విలేకరి ప్రశ్నించగానే.. పూజా ఆగ్రహానికి గురైంది. 'అసలు మీ సమస్య ఏంటి?' అని ఎదురు ప్రశ్నించింది. వెంటనే పక్కనే ఉన్న షాహిద్ కపూర్ వాతావరణం వేడెక్కడాన్ని గమనించి తన జోకులతో చల్లపరిచే ప్రయత్నం చేశారు. ఏదేమైనా ఓ కథానాయికను అలాంటి ప్రశ్నలతో ఇబ్బంది పెట్టడం సబబు కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ప్రళయ కాల రుద్రుడిగా ప్రభాస్..
## 'కన్నప్ప' నుంచి ఫస్ట్ లుక్ రిలీజ్

మూవీ న్యూస్,03 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కీలక పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం కన్నప్ప. మంచు కుటుంబం నుంచి వస్తున్న ఈ మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌లో మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తుండగా.. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తున్నాడు. ఏప్రిల్ 25న వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. ఈ సందర్భంగా మూవీ నుంచి సాలిడ్ అప్‌డేట్‌ని ప్రకటించింది. ఈ మూవీ నుంచి ప్రభాస్ ఫస్ట్ లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో రుద్రుడి గా ప్రభాస్ నటించబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ సందర్భంగా ఫస్ట్ లుక్ విడుదల చేసింది. ప్రళయ కాల రుద్రుడు.. త్రికాల మార్గదర్శకుడు, శివాజ్ఞ పరిపాలకుడు అంటూ ప్రభాస్ పోస్టర్‌ని పంచుకుంది. హిస్టారికల్ కం మైథాలజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి మంచు మోహన్ బాబు, మంచు విష్ణులతో పాటు పలువురు అగ్ర కథానాయకుల ఫస్ట్ లుక్‌లను విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ అందుకుంది.



Printed, Published and owned by ---------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com